
www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273
1వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 32 | | 8-7-2026 | | బుధవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |



# 38 మందికి ఉరి

- మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష
- 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసు
- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన గుజరాత్ హైకోర్టు



4







# ఓపెన్ ఛాలెంజ్

## కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చకు సిద్ధం

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, లోపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను ఆర్థిక ఉగ్రవాదులుగా అభివర్ణించిన ఆయన.. దమ్ముంటే కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చకు రావాలని కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో జరిగిన అవినీతిపై ప్రజాభవన్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ ఎప్పుడు లెటర్ రాస్తే అప్పుడే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెడతామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంత సమయం మాట్లాడాలనుకుంటే అంత సమయం ఇస్తామని స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

- రీడిజైన్ పేరుతో భారీ కుంభకోణం
- లక్ష కోట్లకు చేరిన అంచనా
- కేసీఆర్, కేటీఆర్‌లు ఇంజనీర్లు కాదు
- అబద్ధాలతో మభ్యపెట్టడమే వారి నైపుణ్యం
- కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యేక చర్చ
- కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ సవాల్

# కోటి మంది కోటీశ్వరులు!

- మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం
- విద్యార్థులకు ఉచితంగా భోజన సదుపాయం
- ఉప్పల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నాచారంలో బాలామృతం ప్లాంట్ ప్రారంభం

2



# బీఎల్ఓలకు బెదిరింపులు

అడ్డుకుంటున్న కాంగ్రెస్, ఎంఐఎం నాయకులు

ఇంటింటికీ వెళ్లకుండా దౌర్జన్యపూరిత చర్యలు

సీఈఓకు ఫిర్యాదు చేసిన బీజేపీ

ఓటర్లకు ఇంగ్లిష్ ఫారాలు ఇవ్వాలి: రామచందర్ రావు

2



# పార్టీ పేరుపై న్యాయ పోరాటం



- ఎన్నికల సంఘం నిర్ణయంపై పిటిషన్
- హైకోర్టును ఆశ్రయించిన కవిత
- ఎన్నికల సంఘానికే సమాధానం చెప్పాలి
- ఢిల్లీ హైకోర్టు

2

పార్టీ పేరు మార్పు విషయమై కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు. 'తెలంగాణ రక్షణ సమితి' పేరును తన పార్టీకి కేటాయించాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ముందుగా ఎన్నికల సంఘానికే సరైన సమాధానం చెప్పాలని, వారి విధుల్లో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

# హిమాన్షు గాయం!

ఏఐజీ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స

- ఆస్పత్రికి చేరుకున్న కేసీఆర్, కేటీఆర్
- కోలుకుంటున్నానని తెలిపిన కేటీఆర్ తనయుడు



3

# కడియంపై సురేఖ కన్నెర్ర!

- దేవాదాయ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష
- మంత్రికి సమాచారం ఇవ్వని కడియం
- పరిపాలనా వ్యవస్థకు ఇది విరుద్ధం
- ముఖ్యమంత్రి రేవంత్‌కు సురేఖ ఫిర్యాదు
- క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని



దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తనకు కనీస సమాచారం ఇవ్వకుండా ఆ శాఖ అధికారులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారిక సమీక్ష నిర్వహించడంపై మంత్రి కొండా సురేఖ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నిస్తూ పరిపాలనా వ్యవస్థలో అయోమయం సృష్టిస్తున్న ఆయనపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు.

వివరాలు 3లో..



# 10న రైతు ఆశీర్వాద సభ

రద్దయిన చోటనే తిరిగి నిర్వహణ

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

# రిటైర్డ్ టీచర్ ఆత్మహత్య

33 పేజీల సూసైడ్ నోట్ స్వాధీనం

వివరాలు 3లో..

# ప్రలోభాలకు లొంగితే వేటే!

- అవినీతి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు
- సిబ్బందికి డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరిక
- ప్రజలకు కచ్చితంగా అందుబాటులో ఉండాలి

3



# సింగరేణికి అండ

- తాడిచర్ల-2 బొగ్గు గని కేటాయింపు
- నైనీ కోల్ బ్లాక్‌లోనూ ఉత్పత్తి
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



3

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం
8 జూలై 2026

# బీఎల్ఓలకు బెదిరింపులు

**అడ్డుకుంటున్న కాంగ్రెస్, ఎంఐఎం నాయకులు**

**ఇంటింటికీ వెళ్లకుండా దౌర్జన్యపూరిత చర్యలు**

**సీఈఓకు ఫిర్యాదు చేసిన బీజేపీ**



**హైదరాబాద్, జూలై 7:** బూత్ లెవెల్ అధికారులను (బీఎల్ఓ) ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తూ ఓటరు సవరణ ప్రక్రియను అడ్డుకుంటున్నారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఆయన ఆధ్వర్యంలోని బీజేపీ ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి (సీఈఓ) ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలో ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియ సజావుగా జరిగేలా కఠిన చర్యలు తీసుకోవాలని సీఈఓను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు కోరారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని బీజేపీ బృందం కలిసింది. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్ ప్రక్రియ విషయంలో ఎంఐఎం పార్టీ వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం సరిగ్గా లేదని రామచందర్ రావు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంచలన ఆరోపణలు చేశారు.

**అధికారులకు అడుగడుగునా అడ్డంకులు..**

పలు ప్రాంతాల్లో విధుల్లో ఉన్న బీఎల్ఓలను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని రామచందర్ రావు తెలిపారు. అధికారులను ఇంటింటికీ వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. దీనివల్ల పలువురు ఓటర్లకు ఫారాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం తెలుగు ఫారాలు మాత్రమే ఇస్తుండటంతో ఇతర రాష్ట్రాల ఓటర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హైదరాబాదే కాకుండా అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఓటర్లకు ఇంగ్లిష్ ఫారాలు కూడా అందించాలని ఎన్నికల అధికారిని కోరినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్ది, అధికారులను బెదిరిస్తున్న నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఈఓను కోరినట్లు రామచందర్ రావు పేర్కొన్నారు.

# పార్టీ పేరుపై న్యాయ పోరాటం

**ఎన్నికల సంఘం నిర్ణయంపై పిటిషన్**

**హైకోర్టును ఆశ్రయించిన కల్వకుంట్ల కవిత**

**ఎన్నికల సంఘానికే సమాధానం చెప్పాలి**

**స్పష్టం చేసిన ఢిల్లీ హైకోర్టు**

**న్యూఢిల్లీ, జూలై 7:** పార్టీ పేరు మార్పు విషయమై కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు. 'తెలంగాణ రక్షణ సమితి' పేరును తన పార్టీకి కేటాయించాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ముందుగా ఎన్నికల సంఘానికే సరైన సమాధానం చెప్పాలని, వారి విధుల్లో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. పార్టీ పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ పేరు ఖరారుపై ఆమె న్యాయ పోరాటానికి దిగారు. 'తెలంగాణ రక్షణ సమితి' పేరును తన పార్టీకి కేటాయించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని ఆ పిటిషన్‌లో ఆమె పేర్కొన్నారు.



**టీఆర్ఎస్ వచ్చేలా వద్దు..**

తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఎన్నికల సంఘం తెలిపిందని కవిత తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. 'తెలంగాణ రక్షణ సేన' లేదా 'సమితి' పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే ఈసీ నోటీసుకు ముందుగా సరైన రీతిలో సమాధానం చెప్పాలని ఢిల్లీ హైకోర్టు కవితకు స్పష్టం చేసింది. ఎన్నికల సంఘానికి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు న్యాయస్థానం సూచించింది. ఈ దశలో పిటిషన్ విచారణను చేపట్టడమంటే ఎన్నికల సంఘం విధుల్లో జోక్యం చేసుకోవడమేనని ఢిల్లీ హైకోర్టు అభిప్రాయపడింది.

# డిఎస్పీ భీమ్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్

**హైదరాబాద్,జూలై7:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయిన డీఎస్పీ భీమ్‌రెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. భారీ ఎత్తున అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో ఏసీబీ అధికారులు ఆయన నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ తనిఖీల్లో ఏకంగా రూ. 300 కోట్లకు పైగా విలువైన అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, కోర్టు ముందు హాజరుపరిచారు. కేసు తీవ్రతను పరిశీలించిన న్యాయస్థానం భీమ్‌రెడ్డికి 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాల అనంతరం పోలీసులు ఆయన్ను గట్టి భద్రత నడుమ చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# ఓపెన్ ఛాలెంజ్

- కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చకు సిద్ధం
- రీడిజైన్ పేరుతో భారీ కుంభకోణం
- లక్ష కోట్లకు చేరిన అంచనా
- కేసీఆర్, కేటీఆర్‌లు ఇంజనీర్లు కాదు
- అబద్ధాలతో మభ్యపెట్టడమే వారి నైపుణ్యం
- కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ ఓపెన్ ఛాలెంజ్!



**హైదరాబాద్, జూలై 7:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, లోపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను ఆర్థిక ఉగ్రవాదులుగా అభివర్ణించిన ఆయన.. దమ్ముంటే కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చకు రావాలని కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో జరిగిన అవినీతిపై ప్రజాభవన్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ ఎప్పుడు లెటర్ రాస్తే అప్పుడే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెడతామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంత సమయం మాట్లాడాలనుకుంటే అంత సమయం ఇస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ కేసీఆర్ వాదనలో బలముందని రుజువైతే రాబోయే మూడేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను, మేజర్ కాంట్రాక్టును ఆయనకే అప్పగిస్తామని, ఆయన ఇష్టం వచ్చిన వాళ్లకు ఆ కాంట్రాక్టు ఇచ్చుకోవచ్చంటూ సంచలన సవాల్ చేశారు.

**ఆర్థిక ఉగ్రవాదులు వాళ్లే..**

బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లను ఆర్థిక ఉగ్రవాదులుగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేసీఆర్ కట్టిన ప్రజాభవన్, సెక్రటేరియట్ తాము వాడుతున్నామని, కానీ కాళేశ్వరం విషయంలో గత ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరుపయోగంగా మారిందని మండిపడ్డారు. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని ఏ ఎక్స్‌పర్ట్ కమిటీ కూడా చెప్పలేదని గుర్తుచేశారు. ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోయి భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే తాము అధికారంలోకి వచ్చాక వేల కోట్ల అప్పులు కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని, కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదన్నారు. ప్రజా సొమ్ము గోదావరి పాలు కాకుండా కాపాడటమే తమ లక్ష్యమన్నారు.

**కమీషన్ల కోసమే రీడిజైన్..**

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపినా ఆ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని సీఎం ఆరోపించారు. తనకు నచ్చినట్లు రిపోర్టు వచ్చేలా వ్యాప్కోస్‌కు బాధ్యతలు అప్పగించారన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమీషన్ల కోసమే ప్రాజెక్టును రీడిజైన్ చేశారని ఆరోపించారు. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టు అంచనాను లక్ష కోట్లకు పెంచారని విమర్శించారు. ప్రాజెక్టుపై ప్రతిపక్షం సృష్టించిన అపోహలు తప్పని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదని, మానిప్యులేటర్లని ఆయన తీవ్రంగా ఆగ్రహించారు. అబద్ధాలు చెప్పడంలో వారికి వారే సాటి అని మండిపడ్డారు. కాగ్ నివేదిక ప్రకారం ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు చేరిందన్నారు. డబ్బులు కొల్లగొట్టాలన్న ఆశతోనే ప్రాజెక్టును ప్రారంభించారని ధ్వజమెత్తారు.

**ఏడాదిలోపే కుంగిన మేడిగడ్డ..**

పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులను తీసుకొచ్చి యజ్ఞాలు చేశారని రేవంత్ విమర్శించారు. కట్టిన ఏడాదిలోపే మేడిగడ్డ కుంగిపోయిందని, నాటి ప్రాజెక్టు ఏఈనే లోపాలను బయటపెట్టారన్నారు. సమస్యను గుర్తించకపోవడం వల్లే కూలిపోయిందని, 2022లో వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోయిందన్నారు. 2023 అక్టోబర్‌లో ఆరు పిల్లర్లు కూలిపోయాయని, బ్యారేజీలు, డ్యామ్‌లు కడితే 25 శాతం చొప్పున నింపుతారని తెలిపారు. అయితే కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదికే బ్యారేజీలను నింపేశారన్నారు. ఇసుక మీదనే బ్యారేజీలు కట్టడం వల్లే ప్రాజెక్టు కుంగిందని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల కింద ఆయకట్టే లేదని విమర్శించారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కోటి మంది కోటీశ్వరులు!

- మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం
- విద్యార్థులకు ఉచితంగా భోజన సదుపాయం
- ఉప్పల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నాచారంలో బాలామృతం ప్లాంట్ ప్రారంభం



**హైదరాబాద్, జూలై 7:** రాష్ట్ర ప్రగతిలో మహిళలు, పిల్లల పాత్ర అత్యంత కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. నాచారంలో నూతనంగా నిర్మించిన బాలామృతం తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, 2034 నాటికి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ఆరేళ్ల వయసు వచ్చే వరకు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. నాచారంలో 20 ఎకరాల విస్తీర్ణంలో 40 కోట్ల రూపాయలతో నిర్మించిన బాలామృతం ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ ప్లాంట్ ద్వారా గంటకు 18 టన్నుల బాలామృతం తయారు చేయనున్నట్లు అక్కడి సిబ్బంది ఆయనకు వివరించారు. ఇక్కడ తయారయ్యే బాలామృతాన్ని ఇతర నాలుగు, ఐదు రాష్ట్రాలకు కూడా సరఫరా చేసే విధంగా ప్లాంట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**పిల్లల భవిష్యత్తుపైనే శ్రద్ధ..**

పిల్లలకు ఓట్లు లేకపోయినా వారి భవిష్యత్తు పట్ల తమ ప్రభుత్వానికి ఎంతో శ్రద్ధ ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులందరికీ నాణ్యమైన అల్పాహారం, భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల కోసం ఏటా 27 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. నాణ్యతను పరిశీలించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కూడా అక్కడే అల్పాహారం, భోజనం చేయాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు.

**నెలకు 10 వేల ఆదా..**

మహిళల సంక్షేమం గురించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. దీని వల్ల పనులకు వెళ్లే మహిళలకు నెలకు 10 వేల రూపాయల వరకు ఆదా అవుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరు మీదే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 4.5 లక్షల ఇళ్లు నిర్మించామని, త్వరలోనే పట్టణాల్లో లక్ష ఇళ్లు నిర్మించి పేదలకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన భరోసా ఇచ్చారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు పంచుతామని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలపై సర్కార్ కొరడా!

- పరిపాలనలో పూర్తిస్థాయి పారదర్శకత అమలు
- డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు
- ఏజెన్సీల తీరుపై సీఎం ఆగ్రహం
- 100 రోజుల్లో కమిటీ రిపోర్టు
- 1వ తేదీనే అందరికీ జీతాలు



**హైదరాబాద్, జూలై 7:** కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు అందించేలా పరిపాలనలో డిజిటల్ గవర్నెన్స్ తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న ఏజెన్సీల వ్యవహారంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ వేదికగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు.

**4300 ఏజెన్సీల నిర్వాకం..**

రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌తో ఈ సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1 నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాల చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు.

**100 రోజుల్లో కొలిక్కి రావాలి..**

అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని, ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఆ కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిటలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానిటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, ఎంసీఆర్ హెచ్ఆర్డీ వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# సింగరేణికి అండ

- తాడిచర్ల-2 బొగ్గు గని కేటాయింపు
- నైనీ కోల్ బ్లాక్‌లోనూ ఉత్పత్తి
- ఏటా రూ.75 వేల కోట్ల ఆదాయం
- రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా రాయల్టీ
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ, జూలై 7:** సింగరేణి కాలరీస్ సంస్థకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. తెలంగాణలోని తాడిచర్ల-2 బొగ్గు గనిని నేరుగా సింగరేణికి కేటాయిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆమోదముద్ర వేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ గని ద్వారా సంస్థకు రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు.



### 40 ఏళ్ల పాటు ఉత్పత్తి..

తాడిచర్ల-2 బొగ్గు గనులను సింగరేణికి ఇవ్వాలని గతంలో చాలామంది సీఎంలు లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయిందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తన వంతుగా సంస్థకు అన్ని రకాలుగా అండగా ఉంటూ గని కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్‌లు ఉన్న ఈ బ్లాక్ ద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి చేయవచ్చని చెప్పారు.

### రాష్ట్రానికి 16 వేల కోట్లు..

ఈ తాడిచర్ల-2 గని ద్వారా సింగరేణికి మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ.2,550 కోట్లు మిగులుతాయన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని ఆయన పేర్కొన్నారు.

### నైనీ కోల్ బ్లాక్‌లోనూ..

ఒడిశాలో ఉన్న నైనీ కోల్ బ్లాక్ కూడా సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్‌లు ఉన్నాయని, ఇవి 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోతాయన్నారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని, దీనివల్ల సంస్థకు సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు.

### వేగంగా క్లియరెన్స్‌లు..

తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని కిషన్‌రెడ్డి వెల్లడించారు. సింగరేణి పరిధిలో 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయన్నారు. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని ఆయన అభివర్ణించారు. సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాములయ్యారని, వారి ధైర్యాన్ని ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# కడియంపై సురేఖ కన్నెర్ర!

- దేవాదాయ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష
- మంత్రికి సమాచారం ఇవ్వని కడియం
- పరిపాలనా వ్యవస్థకు ఇది విరుద్ధం
- ముఖ్యమంత్రి రేవంత్‌కు సురేఖ ఫిర్యాదు
- క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్, జూలై 7:** దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తనకు కనీస సమాచారం ఇవ్వకుండా ఆ శాఖ అధికారులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారిక సమీక్ష నిర్వహించడంపై మంత్రి కొండా సురేఖ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నిస్తూ పరిపాలనా వ్యవస్థలో అయోమయం సృష్టిస్తున్న ఆయనపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను, నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి దేవాదాయ కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఆమె తన ఫిర్యాదులో



పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్లు, శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, అలాంటప్పుడు ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు.

### అది అహంకారపూరిత కుట్రే..

కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని సురేఖ విమర్శించారు. ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖా మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె లేఖలో మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై కడియం శ్రీహరి దుష్ప్రచారం చేశారని కొండా సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా ఉద్దేశపూర్వకంగానే తనను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల దేవాదాయ శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

### వివరణ కోరి, చర్యలు తీసుకోవాలి..

ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్రమించిన కడియం శ్రీహరిపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని సురేఖ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆమె తన లేఖలో కోరారు. బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కడియం శ్రీహరి ఈ సమీక్ష నిర్వహించారు. దేవాలయాలకు సమస్య ఉంటే మంత్రికి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ, సమీక్ష నిర్వహించడం ఏంటని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని సీఎం రేవంత్ రెడ్డికి సురేఖ విజ్ఞప్తి చేశారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తనకే ఉంటాయన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

# ప్రలోభాలకు లొంగితే వేటే!

- అవినీతి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు
- సిబ్బందికి డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరిక
- ప్రజలకు కచ్చితంగా అందుబాటులో ఉండాలి
- ఏఐ సాంకేతికతపై ప్రత్యేక శిక్షణ
- సైబర్ నేరాలపై గట్టి నిఘా

**ఖమ్మం, జూలై 7:** రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో అవినీతిని ఏమాత్రం సహించేది లేదని, ప్రలోభాలకు లొంగే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన.. మాదకద్రవ్యాల కట్టడి, సైబర్ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి వినూత్న వ్యవస్థలను తీసుకువస్తున్నట్లు స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసులకు ఏఐ సాంకేతికతపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పోలీస్ వ్యవస్థలో అవినీతిని నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రలోభాలకు లొంగవద్దని హెచ్చరించారు. మంగళవారం






ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొని మీడియాతో మాట్లాడారు. ఖమ్మం కమిషనరేట్ సిబ్బంది పనితీరుపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఖమ్మం ముఖద్వారంగా ఉందని, జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు గత మూడేళ్లుగా జరుగుతున్న నేరాలపై సమీక్షించానని డీజీపీ తెలిపారు. సిబ్బంది సమస్యలను, పనిభారాన్ని అడిగి తెలుసుకున్నామన్నారు.

### సైబర్ నేరాలపై గట్టి నిఘా..

ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు 6500 మంది అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి చర్చించామన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అధికారులు ప్రజలకు కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పోలీసులకు ఏఐ సాంకేతికతపై ప్రత్యేకమైన శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారించామని, స్మగ్లర్లపై చాలా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్, ఏపీ, ఒడిశా రాష్ట్రాల నుంచి పెడ్లర్లు వస్తున్నందున సరిహద్దుల్లో గట్టి నిఘా పెంచామన్నారు. సైబర్ నేరాలతో పాటు సామాజిక మాధ్యమాల్లో అసాంఘిక కార్యకలాపాలను ప్రచారం చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు.

### కొత్తగా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరో..

రాష్ట్రంలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేయబోతున్నామని డీజీపీ సీవీ ఆనంద్ వివరించారు. హైవేలపై ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారని, దీనివల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రహదారుల భద్రతపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# హిమాన్షుకు గాయం!

**ఆటలాడుతుండగా కేటీఆర్ కుమారుడికి గాయం**

**ఏఐజీ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స**

**ఆస్పత్రికి చేరుకున్న కేసీఆర్, కేటీఆర్**

**కోలుకుంటున్నానని తెలిపిన కేటీఆర్ తనయుడు**

**అందరికీ కృతజ్ఞతలు తెలిపిన కేటీఆర్**



**హైదరాబాద్, జూలై 7:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు, మాజీ మంత్రి కేటీఆర్ తనయుడు హిమాన్షుకు స్వల్ప గాయమైంది. నిన్న ఆటలాడుతుండగా అతడి ముక్కుకు గాయం కావడంతో.. ప్రస్తుతం హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు ఆస్పత్రికి చేరుకున్నారు. మరోవైపు సిద్దిపేటలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి బయల్దేరిన కేసీఆర్ కూడా ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. మనవడిని పరామర్శించి.. అతడి ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

### కోలుకుంటున్నానని వెల్లడి..

మరోవైపు తాను కోలుకుంటున్నట్లు హిమాన్షు ఎక్స్ (సామాజిక మాధ్యమం) వేదికగా వెల్లడించారు. చిన్నపాటి గాయం కావడంతో గత రాత్రి ఆస్పత్రిలో చేరానని తెలిపారు. పూర్తిగా కోలుకునేందుకు కొంత విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు హిమాన్షు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. సోమవారం సాయంత్రం హిమాన్షుకు చిన్నపాటి గాయమైందని, ప్రస్తుతం చికిత్స కొనసాగుతోందని తెలిపారు. కొన్ని రోజుల్లోనే పూర్తిగా కోలుకుంటాడని ఆయన స్పష్టం చేశారు. హిమాన్షు ఆరోగ్యంపై ఆరా తీసిన వారందరికీ కేటీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రిటైర్డ్ టీచర్ ఆత్మహత్య

**33 పేజీల సూసైడ్ నోట్ స్వాధీనం**

**జనగామ,జూలై7:** జిల్లాలో రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. జనగామ పట్టణంలోని పూర్ణిమ కాలనీకి చెందిన పగిడిపల్లి మల్లయ్య అనే రిటైర్డ్ టీచర్ ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. చనిపోయే ముందు తన చావుకు కారణమైన వారి పేర్లతో మల్లయ్య సూసైడ్ నోట్ రాశారు. మొత్తం 33 పేజీల సూసైడ్ నోట్‌ను రాసి చనిపోయారు. రిటైర్డ్ టీచర్ రాసిన నోట్‌లో బావమర్దులు గుంటి రత్నాకర్, మనోహర్ పేర్లు ఉన్నాయి. వీరిద్దరి వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మల్లయ్య లెటర్‌లో రాశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు మల్లయ్య రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసుల విచారణ కొనసాగనుంది. మల్లయ్య మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహా రెడ్డి మృతి

**సంతాపం తెలిపన కెసిఆర్**

**హైదరాబాద్,జూలై7:** తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహా రెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రాజకీయాల్లో నిరాడంబరత, నీతి నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన ప్రజల మనిషి నర్సింహా రెడ్డి అని, వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. భూదానోద్యమంలో తను వందలాది ఎకరాలను పేదలకు పంచిన నర్సింహా రెడ్డి, 1969లో తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో పాల్గొని, మూసీ పరిరక్షణ, తెలంగాణకు గోదావరి నదీ జలాల కోసం కృషి చేశారని తెలిపారు. శోక తప్తులైన కొమ్మిడి నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# 10న రైతు ఆశీర్వాద సభ

**రద్దయిన చోటనే తిరిగి నిర్వహణ**

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల**

**ఖమ్మం,జూలై7:** గత నెలలో రద్దయిన రైతు ఆశీర్వాద సభను తిరిగి ఈ నెల 10న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మరో భారీ బహిరంగ సభకు సిద్ధమైంది. 10వ తేదీన ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో ప్రతిష్టాత్మక 'రైతు ఆశీర్వాద సభ' నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఈ భారీ సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభాస్థలాన్ని స్వయంగా పరిశీలించారు.. సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను రికార్డ్ స్థాయిలో అందజేసిందని కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం ఏడు రోజుల్లోనే ఏకంగా 7,491 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని ఆయన స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లాల వారీగా రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఎల్‌నినోపై అగ్రివర్సిటీ చేసిన సూచనలు రైతులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే 'తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం'తో రైతులకు వాట్సప్ ద్వారా కచ్చితమైన, సమయానుకూలమైన వాతావరణ సమాచారాన్ని అమలు చేస్తున్నాం. పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలను వెంటనే అమలు చేయాలని తుమ్మల సూచించారు.



# జనాభా పెరిగితే తట్టుకోగలమా?

ఎన్నికల ముందు నేతలు ఇచ్చే హామీలన్నీ ఓట్ల కోసం అని ప్రజలు గుర్తించనంత వరకు ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక సొంత ఎజెండాతో సాగుతారు. ఓట్ల కోసం తప్ప ప్రజలపై లేదా రాష్ట్రం, దేశంపై ప్రేమతో ఏ రాజకీయ నాయకుడు పనిచేయరని గుర్తించాలి. ఎపిలో చంద్రబాబు జనాభా విషయంలో చేస్తున్న విన్యాసం ఇదే. కేవలం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా లాగేసేం దుకు అధికా జనాభా కావాలి, పిల్లను కనండి, డబ్బులు ఇస్తాను అంటున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ ఉన్నవారికి తక్షణం 5వేల సాయం ప్రకటించారు. మరి లోకేశ్ ఒక్క పిల్లాడితోనే ఎందుకు సరిపుచ్చాడు. ఆయనకు ఈ నియమం వర్తించదా? చంద్రబాబు ఇంట్లోనే ఈ పద్దతి లేనప్పుడు రాష్ట్రానికి ఎందుకు అంటగట్టాలన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇందులో ఏదో మతలబు లేకుండా చంద్రబాబు ప్రకటించరని గుర్తించాలి. ఇకపోతే ఎపిలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. సాయికృష్ణ అనే వ్యక్తిని పోలీసులు తీసుకుని వెళ్లి మాయం చేస్తే అతీగతీ లేదు. ఓ చిన్నారి తప్పిపోతే దిక్కులేదు. రేప్‌లు జరుగుంతుంటే అడిగేవారు లేరు. కేవలం అమరావతి ఒక్కటే ఇప్పుడు లక్ష్యంగా బాబు పాలన సాగిస్తున్నాడు. ఇప్పటికే 33 వేల ఎకరాలు సేకరించినా ఇంకా భూమి కావాలంటూ రైతులను వేధిస్తున్నారు. భూములు ఇచ్చిన వారికి సక్రమంగా ప్లాట్లు ఇచ్చి వారిని సంతోషంగా ఉంచడం లేదు. కేవలం రియల్ వ్యాపారం లక్ష్యంగా బాబు పాలన సాగుతోందని వైసిపి ఆరోపణలు చేస్తోంది. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారని జగన్ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిన పాలకులు అధికారంలోకి రాగానే తమ సొంత ఎజెండా అమలు చేస్తుంటారు. ఇలా ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. అవినీతి అన్నది కేవలం ఉద్యోగులకే పరిమితం అయ్యింది. వారు లంచం తీసుకుంటే పట్టేస్తున్నారు. అలా పట్టుకుంటున్న వారి సంఖ్య ఒక్కశాతం కూడా ఉండదేమో. లంచం లేనిదే పని జరగడం లేదు. లంచాల కోసమే ఉద్యోగాలు ఇచ్చారేమో అనుకోవాలి. ఇకపోతే ఇప్పటికే దేశం అధిక జనాభాతో సతమతం అవుతోంది. ఉన్న జనాభాకు సరిపడా తిండిపెట్టలేక పోతున్నాం. కనీస వసతులు కల్పించలేకపోతున్నాం. విద్య,వైద్యం అందించలేకపోతున్నాం. దేశం అభివృద్ధి చెందాలంటే కనీస వసతులు కలగాలి. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ప్రజలు కూడా తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మనం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే, పాలిస్తే నష్టపోయేది రాష్ట్రమే. నష్టం జరిగేది ప్రజలకే తప్ప పాలకులకు కాదు. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. 145 కోట్ల జనాభాతో సతమతమవుతోంది. యువశక్తి, సహజ వనరులు, మేథో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నా, అడుక్కు తిన్నట్లుగా ప్రజల జీవితాలు సాగుతున్నాయి. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, పర్యావరణం వంటి విషయాల్లో వెనకబడి ఉన్నాం. అవినీతి ఊడలు దిగుతోంది. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, ప్రజల నిర్లక్ష్యం కూడా ఓ కారణంగా చూడాలి. మనకెందుకులే అనుకుంటే ఇలాగే సాగదీస్తారు. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యతా యుతమైన పాత్ర పోషించాలి. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ లేకపోతే పాలకులు మనలను ఏమారుస్తారని గుర్తించాలి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరును చూస్తున్నాం. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా పాలన సాగుతోంది. ఆదాయాలను మించి ఖర్చు చేస్తున్నారు. రాజకీయ నేతల జీత భత్యాలు తడిసి మోపెడు అవుతున్నాయి. సంపాదనే ధ్యేయంగా కొందరి పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల విధి. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయరాదు. కానీ నిత్యం జరుగుతున్నది దుర్వినియోగం తప్ప మరోటి కాదు. ప్రజల సమస్యలను వినడం, తెలుసుకోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడడం అన్నది జరగడం లేదు. పాలనలో జవాబుదారీతనం లేకుండా పోతోంది. ఎన్నికల రోజున బలవంతంగా ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది మన కర్తవ్యాన్ని విస్మరించయడమే అవుతుంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరి శీలించడం, తప్పులను ఎత్తి చూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించాలి. అధిక జనాభాతో సతమతం అవుతున్న మనం కనీస సౌకర్యలు లేనప్పుడు జనాభాను పెంచాలన్న పిలుపును వ్యతిరేకించాలి. ఉన్న పౌరులకు ఎలాంటి సౌకర్యాలు ఇస్తున్నారో అడగాలి. గర్భిణీలకు కనీస డెలివరీ సరిపడా ఆస్పత్రులు, వసతులు లేవన్న విషయం పాలకులకు గుర్తు చేయాలి. జనాభా పెరుగుదల అనర్థ హేతవు తప్ప అభివృద్ధి కాదని గుర్తిస్తే మంచిది.

# 38 మందికి ఉరి





## మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష

## గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

## 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసు

## ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన గుజరాత్ హైకోర్టు

**అహ్మదాబాద్, జూలై 7:** దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలు వరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్, సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం.2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్‌లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

# రాముడి కానుకలన్నీ సేఫ్

## స్పష్టం చేసిన రామ్ మందిర్ ట్రస్ట్

**లఖ్‌నవూ, జులై 7:** అయోధ్య రామమందిరానికి భక్తులు సమర్పించిన కానుకలన్నీ భద్రంగా ఉన్నాయని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ స్పష్టం చేసింది. మార్చి 31, 2026 నాటికి ట్రస్ట్ ఆధీనంలో 32.259 కేజీల బంగారం.. 1,518.925 కేజీల వెండి వస్తువులు ఉన్నట్లు అధికారికంగా ప్రకటించింది. విరాళాల చోరీ వివాదం నేపథ్యంలో రామాలయ ట్రస్ట్ కానుకల లెక్కలు తేల్చింది. మాయమయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగిన బంగారు రామచరితమానస్, వజ్రాల నెక్లెస్, వెండి పాదుకలను ట్రస్ట్ సభ్యులు మీడియా సమక్షంలో ప్రదర్శించారు. ప్రతి కానుకకూ దాత వివరాలతో సహా రికార్డులు ఉన్నాయని ట్రెజరర్ స్వామి గోవింద్ దేవ్ గిరి తెలిపారు. ఏటా స్వతంత్ర సీఏ సంస్థతో భౌతిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు ఇచ్చిన 849 కేజీల వెండి వస్తువులను భారత ప్రభుత్వ మింట్ ద్వారా కరిగించి, శుద్ధి చేసి భద్రపరిచామని గోవింద్ పేర్కొన్నారు. కాగా, విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రాలు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తాత్కాలిక జనరల్ సెక్రటరీగా కృష్ణ మోహన్‌ను నియమించింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రత్యేక సీఈఓ నియామకానికి నిర్ణయం తీసుకుంది. సిట్ దర్యాప్తునకు పూర్తి సహకారం అందిస్తామని, తప్పు చేసిన వారిని వదిలేది లేదని ట్రస్ట్ స్పష్టం చేసింది.

# నౌకలపై ఇరాన్ మిస్సైల్ దాడి

**టెహ్రాన్, జూలై 7:** హోర్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. హోర్ముజ్‌లో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ రెవల్యూషనరీ కార్ప్స్ గార్డ్స్ దాడులు చేసింది. రెండు నౌకలపై మిస్సైల్స్ ప్రయోగించింది. ఈ దాడుల్లో రెండు నౌకలు దెబ్బ తిన్నాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ విషయాన్ని అమెరికా అధికారులు మీడియాకు వెల్లడించారు. కాగా, మూడు వారాల క్రితం అమెరికా, ఇరాన్ దేశాలు మెమొరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్‌పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం హోర్ముజ్ జలసంధిలో దాడులు ఆపేస్తామని ఇరాన్ ప్రకటించింది. రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం జరిగిన తర్వాత కూడా ఇరాన్ దాడులకు పాల్పడటంపై అమెరికా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మరో ఘటనలో.. ఒమన్‌లోని లిమా తీరంలో దక్షిణ దిశగా ప్రయాణిస్తున్న ఓ ఆయిల్ ట్యాంకర్‌ను పేలుడు వస్తువు బలంగా ఢీకొట్టింది. దీని కారణంగా ఆ నౌక ఎడమ వైపు భాగంలో భారీగా మంటలు చెలరేగాయి. బ్రిటీష్ మిలిటరీకి చెందిన 'యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్' ఈ ప్రమాదాన్ని అధికారికంగా ధ్రువీకరిస్తూ ప్రకటన విడుదల చేసింది.

# దేశవ్యాప్తంగా వరుణుడి బీభత్సం

- కేరళ, మహారాష్ట్ర, కాశ్మీర్, గుజరాత్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు
- వయనాడ్‌లో విరిగిపడ్డ కొండచరియలు..
- ముగ్గురు మృతి; ముంబై వీధులు జలమయం





**తిరువనంతపురం/ముంబై, జూలై 7:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వరుణుడు ప్రతాపం చూపిస్తున్నాడు. కేరళ, మహారాష్ట్ర, జమ్మూకాశ్మీర్, గుజరాత్ రాష్ట్రాలలో కురుస్తున్న కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. కేరళలోని వయనాడ్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న రికార్డు స్థాయి భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. 24 గంటల వ్యవధిలోనే సుమారు 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో మంగళవారం మధ్యాహ్నం మేప్పాడి సమీపంలోని కల్లాడి ప్రాంతంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. మలప్పురం--వయనాడ్ జిల్లాలను కలిపే నిర్మాణంలో ఉన్న సొరంగ మార్గం (మీనాక్షి వంతెన సమీపంలో) వద్ద ఈ దారుణం జరిగింది. కొండపై నుంచి మట్టి, బండరాళ్లు ఒక్కసారిగా విరిగిపడి కార్మికుల వసతి గృహంతో పాటు కొన్ని ఇళ్లు, హోమ్‌స్టేలపై పడ్డాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందగా, మట్టి కింద కూరుకుపోయిన ఆరుగురిని స్థానికులు రక్షించారు. శిథిలాల కింద మరో 30 మంది వరకు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రతికూల వాతావరణం, నిరంతర వర్షం కారణంగా ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది సాగిస్తున్న సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. సమీపంలోని దాదాపు 100 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘోర ప్రమాదంపై కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ అత్యవసర సమావేశం నిర్వహించి, యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకు మంత్రులు అనిల్ కుమార్, సిద్ధిక్‌లను వయనాడ్‌కు పంపించారు. కాగా, 2024లోనూ వయనాడ్‌లోని ముండక్కై, చూర్‌మాలా ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి 298 మంది మరణించిన సంగతి తెలిసిందే.

## ముంబైని ముంచెత్తిన జోరువాన

దేశ ఆర్థిక రాజధాని ముంబై సహా మహారాష్ట్రలోని పలు ప్రాంతాలను కుండపోత వర్షాలు ముంచెత్తాయి. గత 24 గంటల్లో కొన్ని ప్రాంతాలలో గరిష్టంగా 600 మిల్లీమీటర్ల వర్షం కురవగా, ప్రముఖ హిల్ స్టేషన్ లోనవాలాలో ఏకంగా 670 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంబై వీధులన్నీ జలమయమవడంతో రహదారి రవాణా స్తంభించింది. రైలు సర్వీసులు చాలావరకు నిలిచిపోగా, వందలాది విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముంబై--పుణె మార్గంలోని కర్జత్-లోనావాలా ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడటంతో రెండు రోజులుగా భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ముంబై, థానే, పుణె, పాల్ఘర్ పరిసరాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. వాతావరణ శాఖ ముంబైకి ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరించారు.

## కాశ్మీర్‌లో ఆకస్మిక వరదలు.. గుజరాత్‌లో నిండిన ప్రాజెక్టులు

జమ్మూకాశ్మీర్‌లోని డోడా, కిష్త్వార్ జిల్లాల్లో గత రెండు రోజుల్లో వరుసగా మూడోసారి ఆకస్మిక వరదలు సంభవించాయి. డోడా జిల్లా తాత్రి పట్టణంలో మంగళవారం కొండచరియలు విరిగిపడి, ఎగువ నుంచి వచ్చిన వరద తాకిడికి ఇళ్లు, దుకాణాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రోడ్డు పక్కన నిలిపిన అనేక వాహనాలు మట్టిలో కూరుకుపోగా, కొన్ని చీనాబ్ నదిలో కొట్టుకుపోయాయి. వరదల వల్ల డోడా-కిష్త్వార్ జాతీయ రహదారి మూతపడింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని డిప్యూటీ కమిషనర్ కృష్ణన్ లాల్ తెలిపారు. మరోవైపు గుజరాత్ అంతటా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు ఉప్పొంగుతున్నాయి. నీటిపారుదల ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. భావ్‌నగర్ జిల్లా పాలితానాలోని శెత్రుంజీ డ్యామ్‌కు వరద పోటెత్తడంతో అధికారులు ప్రాజెక్టుకు చెందిన 59 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. వర్షాల తీవ్రత దృష్ట్యా కొండ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

**ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:**
ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మావల మండలం వాఘాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు నమోదు (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో కొనసాగుతున్న ఓటర్ల నమోదు, ఫారాల పంపిణీ ప్రక్రియను పరిశీలించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, అర్హత ఉన్న ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో అర్హుల పేర్లు గల్లంతు కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో ఓటరు నమోదు ప్రక్రియను నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుదురపాక సురేష్, పార్టీ నాయకులు భూపెల్లి శ్రీధర్, గౌతమ్, రాజేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు మహమ్మద్ సమద్



**ఉద్యమ కెరటం, నర్సాపూర్:**
తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ నర్సాపూర్ బాలుర–1 జూనియర్ కళాశాల విద్యార్థి మహమ్మద్ సమద్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికై ప్రతిభ చాటాడు. ప్రస్తుతం కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కొండ మురళి మహమ్మద్ సమద్ను ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో సాధించిన విజయాన్ని జాతీయ స్థాయిలోనూ కొనసాగించి కళాశాలతో పాటు తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. మహమ్మద్ సమద్ జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసి పతకం సాధించాలని కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, తోటి విద్యార్థులు ఆకాంక్షించారు. ఈ విజయం కళాశాలకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఉద్యమ కెరటం, తాండూర్:**
ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ ప్రాంగణంతో పాటు బోయపల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక నాయకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాజిక న్యాయం, మాదిగల హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్ చేస్తున్న ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వేల్పుల శంకర్, తాండూర్ మండల ఇన్చార్జి ఆయిల్ల గణేష్, నాయకులు కాసిపేట కృష్ణ, జీలకర్ర శంకర్, ఆనంద్, సంతోష్, లక్ష్మణ్, నరసింహులు, అశోక్, ఇప్ప శ్రీను, రాహుల్, బోయపల్లి గ్రామ అధ్యక్షుడు వేల్పుల రాజ్కుమార్, ప్రధాన కార్యదర్శి ఇరిగినాల పురుషోత్తం, వేల్పుల కిరణ్, బన్నీ, తిప్పరపు సందీప్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జులై 10న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

- **వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:**
రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల (పీ డీ ఎస్ యూ, ఏ ఐ ఎస్ ఎఫ్) ఆధ్వర్యంలో జులై 10న చేపట్టే 'కేజీ టు పీజీ' విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇంచార్జీ ఇటంకర్ తిరుపతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో పేరుకు పోయిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించి సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలని కోరారు. అలాగే ప్రైవేటు విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఫీజుల నియంత్రణ చట్టం' తీసుకురావాలని, వివిధ యూనివర్సిటీల్లో ఉన్న మెస్ బకాయిలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నర్సింగ్ విద్యార్థినులకు ఉచితంగా హాస్టల్ సౌకర్యం కల్పించడంతో పాటు, ఇంజనీరింగ్ విద్య పేరుతో భారీగా డొనేషన్స్ వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ న్యాయమైన డిమాండ్ల తో చేపడుతున్న బంద్‌కు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాకేష్, పీ డీ ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు అయ్యుబ్ ఖాన్, లెనిన్, ఆసిఫాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు సమీర్, తరుణ్, మండల నాయకులు శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కుమురం భీం ప్రాజెక్టును నిర్ల క్ష్యం చేస్తే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

**డి.వై.ఎఫ్.ఐ హెచ్చరిక**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** కుమురం భీం ప్రాజెక్టును జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘోరంగా నిర్లక్ష్యం చేస్తున్నారని జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్, డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం ప్రాజెక్టు ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ 2007లో 10 టి.ఎం.సి ల సామర్థ్యంతో, 45,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్మించిన ఈ ప్రాజెక్ట్ ఆనకట్ట ప్రస్తుతం కుంగిపోయిందని, దీంతో నీటి సామర్థ్యాన్ని 4 టి.ఎం.సి లకు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల సాగునీరే కాకుండా మిషన్ భగీరథ తాగునీటికి కూడా తీవ్ర కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు.గత ఇంచార్జి మంత్రి సీతక్క, ప్రస్తుత ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రాజెక్టు మరమ్మత్తుల పై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. వర్షాకాలంలో ఆనకట్ట పూర్తిగా ధ్వంసమయ్యే ప్రమాదం ఉందని, అధికారులు వెంటనే స్పందించి మరమ్మత్తులు చేపట్టకపోతే లోతట్టు గ్రామాల ప్రజలతో కలిసి కలెక్టరేట్, ఎమ్మెల్యే, మంత్రి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి.వై.ఎఫ్.ఐ దుర్గం నిఖిల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించిన నాయకులు సంస్థ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆత్మగౌరవం, హక్కులు, రాజకీయ సాధికారత లక్ష్యంగా ఏర్పడిన ఎంఆర్పీఎస్ అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సామాజిక న్యాయం, సంక్షేమ పథకాల అమలు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చేపట్టిన ఉద్యమాలను కొనియాడారు. దివ్యాంగులు, వితంతువులు, వృద్ధుల సంక్షేమం కోసం చేపట్టిన ఉద్యమాల ఫలితంగా నేడు పెన్షన్లు అందుతున్నాయని, పేద, బలహీన వర్గాల విద్యాభివృద్ధికి ఎంఆర్పీఎస్ చేసిన కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, రేషన్ బియ్యం పరిమితి పెంపు, ఫాస్ట్రాక్ కోర్టుల ఏర్పాటు వంటి పలు కీలక అంశాల్లో ఉద్యమం తన పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఎంఆర్పీఎస్ కేవలం ఒక వర్గానికే పరిమితమైన సంస్థ కాదని, అన్నివర్గాల ప్రజల శ్రేయస్సు కోసం పనిచేసే ఉద్యమమని స్పష్టం చేశారు. మందకృష్ణ మాదిగ నాయకత్వానికి కట్టుబడి రాష్ట్రంలో రాజకీయ సాధికారత సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గజ్జల శంకర్ మాదిగ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఈదులసావర్గామ్ నుంచి నిపాని మీదుగా అర్లి(టి) వరకు రూ.18 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రూ.5 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం రూ.3 కోట్లతో సుమారు మూడు కిలో మీటర్ల మేర దెబ్బతిన్న రహదారిని పునర్నిర్మిస్తున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను మరింత వేగవంతం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో నూ నాణ్యతలో రాజీ పడకుండా ఇంజినీరింగ్ ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. రహదారి నిర్మాణ పనుల కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేసి, రహదారిని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులతో పాటు కాంట్రాక్టర్కు ఆదేశించారు. కలెక్టర్ వెంట రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నర్సయ్య, కాంట్రాక్టర్ నవీన్, సుమన్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జంతు సంరక్షణ చట్టాలను ఉల్ల ంఘిస్తే కఠిన చర్యలు

- **అక్రమంగా పశువులను తరలిస్తున్న ముఠా అరెస్ట్.. వాహనం సీజ్**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జంతు సంరక్షణ చట్టాలను ఉల్ల ఘిస్తూ పశువులను అక్రమంగా వధశాలలకు తరలిస్తున్న ముఠాను ఆదిలాబాద్ టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. తొమ్మిది పశువులను రక్షించడంతో పాటు 5 కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకుని, రవాణాకు వినియోగిస్తున్న వాహనాన్ని సీజ్ చేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా వస్తున్న ఒక వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో 9 పశువులు ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండా, తాళ్లతో కట్టి వధశాలలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. అదే వాహనంలో అక్రమంగా నిల్వ ఉంచిన 5 కిలోల మాంసాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలానికి చెందిన వారిగా గుర్తించారు. జంతువుల రవాణాకు అవసరమైన చట్టబద్ధమైన అనుమతులు, వెటర్నరీ వైద్యుడి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు, కొనుగోలు పత్రాలు ఏవీ లేవని టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. నలుగురు నిందితులు అబ్దుల్ జహీర్, అబ్దుల్ నజీర్, అబ్దుల్ రఫీక్, అబ్దుల్ బషీర్ అలియాస్ బషీర్ ఖురేషిలను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పశువులను సురక్షితంగా గోశాలకు తరలించినట్లు వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లా డుతూ జంతువులను అక్రమంగా తరలించడం, అక్రమ వధ, మాంసం అక్రమ వ్యాపారంపై జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తోందని తెలిపారు. జంతు సంరక్షణ చట్టాలను ఉల్ల ఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి

• ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గొడం నగేష్




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లా అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గొడం నగేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ కె.హరిత, సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, కోవ లక్ష్మి , ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి నంద మకరందు, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాను అన్ని రంగాలలో ముందంజలో ఉంచాలని, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆకాంక్షిత జిల్లా అని అన్నారు. శిశు సంక్షేమ శాఖలో అంగన్వాడి కేంద్రాలు 1 వేయి 6 ఉన్నాయని, పక్క భవనాలు లేని అంగన్వాడీలను గుర్తించి భవన నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 119 అంగన్వాడీ ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, భర్తీకి చర్యలు తీసుకోవాలని టీచర్లు, ఆయాలు లేని కేంద్రాలలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని తెలిపారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో జెల్ జీవన్ మిషన్ క్రింద ప్రతి గ్రామానికి శుద్ధమైన త్రాగు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు ధర్తీ ఆభ జన జాతీయ మహోత్సవం క్రింద ఆదివాసి, పి.వి.టి.జి. గ్రామాలకు విద్యుత్ సౌకర్యం, గృహాలకు విద్యుత్ కనెక్షన్లు అందించాలని, రహదారి భవనాల శాఖ అధికారులు తమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులు, వంతెనలు, రహదారుల పనులు నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. అటవీశాఖ అనుమతులు త్వరగా తీసుకోవాలని తెలిపారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జన్ మన్ క్రింద పి.వి.టి.జి. గ్రామాలలో వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని, మారుమూల గ్రామాలకు అంబులెన్స్ వెళ్లేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఎం.పి. లాడ్స్ నిఫులతో సంబంధిత ఏజెన్సీలలో పని చేయించి ఖర్చు చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత మిషన్ క్రింద భూసార పరీక్షలు నిర్వహించాలని, యూరియా, విత్తనాల కొరత లేకుండా అధికారులు కృషి చేయాలని, కిసాన్ సమ్మన్ నిధి క్రింద అర్హులైన లబ్ధిదారుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారులకు ఇరువైపులా గల గ్రామాలలో అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బి.ఎస్.ఎన్.ఎల్. శాఖ వారు మారుమూల గ్రామాలలో ఇంటర్నెట్ సౌకర్యం కల్పనకు టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనాలను అందించాలని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు. పలు శాఖల పురోగతిపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులలో ప్రజాప్రతినిధులు, అధికారులకు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరగాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, తప్పులేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం భీంపూర్ మండల కేంద్రంతో పాటు గోన గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు, బీఎల్ఓలను గ్రామాల వారీగా ఓటర్ల జాబితాలో గైర్హాజరైన వారు, వలస వెళ్లిన వారు, మరణించిన ఓటర్ల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత రికార్డులను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని, 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న నూతన ఓటర్ల నుంచి ఫారం-6 ద్వారా దరఖాస్తులు స్వీకరించి వారి పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని అన్నారు. అనంతరం గోన గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్, సూపర్వైజర్లు నర్సింహులు, విజయ్ కుమార్, స్థానిక సర్పంచ్ రంజాన, బీఎల్ఓలు, గ్రామ రెవెన్యూ సిబ్బంది, ఓటర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# అమ్మన మడుగు ప్రాజెక్టుతో చుక్కనీరు అందడంలేదు

• రూ.11.76 కోట్ల నిధులపై ప్రత్యేక విచారణ జరపాలి
• తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్



**ఉద్యమ కెరటం, కెరమెరి:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కేస్లాగూడలోని అమ్మన మడుగు ప్రాజెక్టు ద్వారా నేటివరకు ఒక్క ఎకరం భూమికి కూడా సాగునీరు అందించడంలో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ విమర్శించారు. మంగళవారం మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్వహణ, నిధుల వినియోగంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దాదాపు 25 సంవత్సరాల క్రితం 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును నిర్మించినప్పటికీ, దిగువన ఉన్న కేస్లాగూడ, కెరమెరి గ్రామాల రైతులకు ఇప్పటికీ సాగునీరు అందలేదని పేర్కొన్నారు. గతంలో ప్రాజెక్టు అభివృద్ధి పేరుతో నిధులు మంజూరు చేసినప్పటికీ అవి ఎలా ఖర్చయ్యాయనే అంశంపై ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.11.76 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి పనులు ప్రారంభం కాలేదని ఆరోపించారు. కాలువల తవ్వకం కూడా అసంపూర్తిగా వదిలేయడంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని తెలిపారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో గతంలో, ప్రస్తుతం ప్రాజెక్టు పేరుతో మంజూరైన నిధుల వినియోగంపై ప్రత్యేక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే అమ్మన మడుగు ప్రాజెక్టును వెంటనే అభివృద్ధి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు తక్షణమే స్పందించకపోతే కేస్లాగూడ, కెరమెరి గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు, ప్రజలను ఏకం చేసి భారీ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

# బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

• సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి
• అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు బదిలీ, పదోన్నతి ఉత్తర్వుల అందజేత

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** అంగన్వాడీలు మహిళలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంక్షేమంలో కీలక భూమిక పోషిస్తోందని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సత్తుపల్లి మండలం, సత్తుపల్లి పట్టణ పరిధిలో బదిలీలు, పదోన్నతులు పొందిన అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ ఆయాలకు ఉత్తర్వుల కాపీలను అందజేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సీడీపీఓ సత్యవతిలతో కలిసి ఆర్డర్ కాపీలను అందించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ పారదర్శకంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపడుతుందని తెలిపారు. బదిలీలు, పదోన్నతులు పొందిన అంగన్వాడీ సిబ్బంది తమపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య

అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని రాజీవ్నగర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అదనపు తరగతి గదులు, భోజనశాల, వంటగది నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, ఏఈఈ (ఈడబ్ల్యూఐడీసీ), కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, కార్పొరేటర్లతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు మెరుగైన వసతి, పారిశుధ్యం, పౌష్టికాహారం, తాగునీరు, ఇతర మౌలిక వసతులు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో డ్రైనేజీ సమస్యను పరిశీలించి, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపేలా మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పూరింపు ప్రక్రియను తనిఖీ చేసి, అక్కడికి వచ్చిన ఓటర్లతో మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో నమోదయ్యేలా, సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సంఘటిత పోరాటాలతోనే వికలాంగుల సమస్యల పరిష్కారం

## నేడు కాగజ్నగర్లో ఎన్పీఆర్డీ జిల్లా సమావేశం

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటమే సరైన మార్గమని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) జిల్లా అధ్యక్షుడు పండుగ రాజేష్, జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల బుధవారం ఉదయం 10 గంటలకు కాగజ్నగర్ పట్టణంలోని బాలభారతి పాఠశాల సమీపంలో ఎన్పీఆర్డీ జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి అడివయ్య ముఖ్య అతిథిగా హాజరై వికలాంగుల హక్కుల చట్టం అమలు, పెన్షన్లు, ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై మాట్లాడనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వికలాంగులు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరై తమ సమస్యలను చర్చించడంతో పాటు హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక కార్యకర్తలు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# నూతన ఎంపీడీఓను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరడిగొండ మండల నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన జీవన్ రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల కాంగ్రెస్ కన్వీనర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీడీఓకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ చేరేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆడే వసంత్, జిల్లా సెక్రటరీ అగ్గు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు ప్రపుల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కుమారి గ్రామ మాజీ ఉప సర్పంచ్ నరేష్ రెడ్డి, నాయకులు రాంలక్ష్మణ్ గౌడ్, కపిల్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న అన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని చింతల్వాడలో కొనసాగుతున్న ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. అధికారులు ప్రజల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను చేపట్టారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు వినియోగానికి ఓటరు జాబితాలో సరైన వివరాలు నమోదు కావడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్, ఆర్ఐ పద్మజ, బీఎల్ఓలు విజయలక్ష్మి , బాలభారతి, పావని, బీఎల్ఏ కోఆర్డినేటర్ మేడి శంకర్, బీఎల్ఏలు పెద్దబోయిన రవీందర్, ఆదామ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పప్పీ, దుర్గం మహేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆశపల్లిలో గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని ఆశపల్లి గ్రామంలో ప్రజలకు మెరుగైన వెలుతురు కల్పించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం వీధిదీపాల ఏర్పాటు, మరమ్మత్తు పనులు చేపట్టారు. గ్రామంలోని పలు వీధుల్లో పనిచేయని దీపాల స్థానంలో నూతన ఎల్ఈడీ బల్బులను అమర్చడంతో పాటు విద్యుత్ లైన్లను సరిచేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది స్తంభాలపైకి ఎక్కి పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మరప రవీందర్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో గ్రామ ప్రజలు సురక్షితంగా రాకపోకలు సాగించేలా అన్ని వార్డుల్లో వీధి దీపాల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా వీధిదీపాలు పనిచేయకపోతే వెంటనే గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని, తక్షణమే మరమ్మత్తులు చేపడతామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు గ్రామ పంచాయతీ నిరంతరం కృషి చేస్తోందని, ప్రజలకు అవసరమైన సేవలను మెరుగ్గా అందించేందుకు తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**ఉద్యమ కెరటం, బెజ్జూర్:**
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం బెజ్జూర్ మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పాపన్నపేట, మర్తిడి, కుకుడా తదితర గ్రామాల్లో ఎంఆర్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశాల్లో నాయకులు మాట్లాడుతూ ఎంఆర్పీఎస్ ఆవిర్భావం నుంచి సామాజిక న్యాయం, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం సాగించిన ఉద్యమం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఉద్యమం ద్వారా సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, మందకృష్ణ మాదిగ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం మరింత బలంగా పోరాటం కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎంఆర్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం..

## జైనూర్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో జైనూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ ఆధ్వర్యంలో గ్రామంలోని నీటి ట్యాంకులను శుభ్రపర్చడంతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే గ్రామపంచాయతీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను తమ బాధ్యతగా భావించి గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలు అందించేందుకు గ్రామపంచాయతీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిభకు ప్రోత్సాహం..

## రాష్ట్ర ర్యాంకర్‌ను సన్మానించిన అనంతాచారి

**ఉద్యమ కెరటం, వేములపల్లి**
విద్యార్థులు ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆర్థిక ఇబ్బందులు వారి చదువుకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఆర్టీఐ పర్యవేక్షణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు అనంతాచారి ఓ పేద విద్యార్థినికి ఆర్థిక చేయూత అందించారు. వేములపల్లి గ్రామపంచాయతీకి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ప్రసన్న, ఇంటర్ మొదటి సంవత్సరంలో బయాలజీ (బైపీసీ) విభాగంలో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించడం మండలానికి గర్వకారణమని అనంతాచారి పేర్కొన్నారు. మంగళవారం ఆమెను స్వయంగా కలిసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రసన్న ఇదే పట్టుదలతో చదివి ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు లేకపోయినా ఎన్నో కష్టాలను అధిగమిస్తూ విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ ప్రతిభ చాటడం అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి విద్యార్థులు సమాజంలోని ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. తన వంతు ప్రోత్సాహంగా విద్యార్థిని ప్రసన్నను శాలువాతో సన్మానించి రూ.5,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి వార్డు సభ్యులు సుధీర్, రమేష్, విద్యార్థిని ప్రసన్న నాయనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్లలో.. మొబైల్ మోజు..!

- చదువుకు బదులు సెల్ఫోన్లకు బానిసలవుతున్న హాస్టల్ విద్యార్థులు..?
- వాచ్మెన్, వార్డెన్ పర్యవేక్షణ లోపమా..?
- వాంకిడి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ హాస్టళ్లపై తల్లిదండ్రుల ఆందోళన



**ఉద్యమ కెరటం, వాంకిడి:**
ప్రభుత్వం పేద, గిరిజన, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు మంచి వాతావరణంలో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వ హాస్టళ్లను నిర్వహిస్తోంది. విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, పుస్తకాలు, యూనిఫాం వంటి సౌకర్యాలు కల్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. అయితే ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జెడ్పీఎస్ఎస్ కు అనుబంధంగా ఉన్న హాస్టల్లో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్న కొందరు విద్యార్థులు అధ్యయన సమయాల్లో కూడా సెల్ఫోన్లలో ఎక్కువ సమయం గడుపుతున్నారని, దీనికి ప్రధాన కారణం వాచ్మెన్, వార్డెన్ల పర్యవేక్షణ లోపమేనని అక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. చదువు కోసం హాస్టళ్లలో చేరిన పిల్లలు పుస్తకాలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో మొబైల్ ఫోన్లకు అలవాటు పడుతున్న దృశ్యాలు పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. విద్యార్థులకు పాఠశాలలో ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందిస్తున్నప్పటికీ, హాస్టల్కు వెళ్లిన తర్వాత సరైన పర్యవేక్షణ లేకపోవడంతో చదువుపై ఆసక్తి తగ్గిపోతోందని స్థానికులు చెబుతున్నారు. కొంత మంది విద్యార్థులు సోషల్ మీడియా, వీడియోలు, ఆన్లైన్ గేమ్స్ వంటి వాటిలో సమయాన్ని వృథా చేస్తూ చదువుకు దూరమవుతున్నారని పేర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వారి విద్యా ప్రగతిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా కష్టపడి పిల్లలను చదివించాలనే ఆశతో హాస్టళ్లలో చేర్పించిన తల్లిదండ్రులు ప్రస్తుతం ఆందోళన చెందుతున్నారు. హాస్టల్లో క్రమశిక్షణతో చదువుకుంటారని భావించినా పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలవుతున్నారనే సమాచారం రావడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు చదువుకుంటున్నారనే నమ్మకంతో హాస్టల్లో ఉంచితే, వారు సెల్ఫోన్లలో సమయం గడపడం బాధాకరమని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

### పర్యవేక్షణ బలోపేతం చేయాలన్న డిమాండ్..

హాస్టళ్లలో ప్రతిరోజు అధ్యయన సమయాల్లో వార్డెన్లు, వాచ్మెన్లు క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహించాలని, విద్యార్థుల వద్ద అనుమతి లేకుండా సెల్ఫోన్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు. హాస్టల్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తే విద్యార్థులు చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరుతున్నారు. విద్యార్థుల అధ్యయన వాతావరణాన్ని దెబ్బతీసే అంశాలపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత హాస్టల్ వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారుల స్పందన ఇంకా వెలువడాల్సి ఉంది. ఆరోపణలు వాస్తవమా కాదా.. అనే విషయాన్ని సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, వాస్తవాలు వెల్లడించడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సమీక్ష



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:**
ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వేమనపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు భోజనశాల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరు అందించాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య పెంపు కోసం ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. వేమనపల్లి మండలంలోని గొర్లపల్లి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను సైతం పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారాల పూరణలో ప్రజలకు బీఎల్ఏలు, వాలంటీర్లు సహకరించాలని కోరారు. ఈనెల 24వ తేదీలోగా ఫారాలు సమర్పించకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని ప్రజలను అప్రమత్తం చేశారు. డబుల్, షిఫ్టెడ్, మరణించిన ఓటర్ల తొలగింపు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు, భూభారతి దరఖాస్తుల పెండెన్సీని సమీక్షించారు. భూభారతి దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, వివిధ ధ్రువపత్రాల జారీని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. చెన్నూర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను సందర్శించి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సాయికృష్ణ, ఎంపీడీఓ కుమారస్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.






# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ వేగవంతం చేయాలి

## అదనపు కలెక్టర్ వి.రాములు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:**
ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. మంగళవారం లక్షెట్టిపేట పట్టణం, దండేపల్లి మండలంలోని మేదరిపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ హెల్ప్డెస్క్‌ను పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాలను త్వరితగతిన డిజిటలైజ్ చేసి, సమాచారాన్ని ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. అనంతరం దండేపల్లి, లక్షెట్టిపేట, జన్నారం మండలాల తహశీల్దార్ కార్యాలయాలను బి-సెక్షన్ సూపరింటెండెంట్తో కలిసి సందర్శించి సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, భూసేకరణ అంశాలు, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. రైతుల భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన భూభారతి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, విరాసత్ తదితర భూ సేవలను వేగవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వివిధ ధ్రువపత్రాలను నిర్ణీత గడువులోగా జారీ చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహశీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.







# తగ్గిన బంగారం

**హైదరాబాద్, జులై 7 :** బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి శుభవార్త అందింది. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో పసిడి ధరలు మంగళవారం తగ్గుముఖం పట్టాయి. వరుస రోజులుగా పెరుగుతున్న ధరలకు బ్రేక్ పడటంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది.

హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,260గా నమోదైంది. సోమవారం ధరతో పోలిస్తే రూ.1,360 తగ్గింది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,33,150గా ఉండగా, నిన్నటితో పోలిస్తే రూ.1,250 మేర తగ్గుదల నమోదైంది. తెలంగాణలోని హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో బంగారం ధరలు ఒకే స్థాయిలో కొనసాగుతున్నాయి. ఈ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,260, 22 క్యారెట్ల ధర రూ.1,33,150, 18 క్యారెట్ల ధర రూ.1,08,940గా నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,45,260, 22 క్యారెట్ల బంగారం రూ.1,33,150, 18 క్యారెట్ల బంగారం రూ.1,08,940గా ఉంది. దేశంలోని ప్రధాన నగరాలను పరిశీలిస్తే చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర అత్యధికంగా రూ.1,46,180గా నమోదైంది. న్యూఢిల్లీలో రూ.1,45,410, అహ్మదాబాద్‌లో రూ.1,45,310, ముంబై, బెంగళూరు, కేరళ, కోల్‌కతాలో రూ.1,45,260గా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల్లో వచ్చిన తగ్గుదల, పెట్టుబడిదారుల ధోరణిలో మార్పులు, ప్రపంచ ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో కూడా పసిడి ధరలు తగ్గినట్లు బులియన్ వ్యాపారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ పరిణామాలను బట్టి బంగారం ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# ప్రపంచ కుబేరుడి సంపదకు భారీ దెబ్బ

**హైదరాబాద్, జూలై 7 :** ప్రపంచ కుబేరుడు, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంపదకు ఇటీవల భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్పేస్‌ఎక్స్ షేర్ల విలువ గణనీయంగా పడిపోవడంతో ఆయన మొత్తం ఆస్తి విలువ భారీగా తగ్గినట్లు అంతర్జాతీయ ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఆయన సంపద గతంతో పోలిస్తే గణనీయంగా క్షీణించింది. జూలై ప్రారంభం నుంచి స్పేస్‌ఎక్స్ షేర్ల ధరలు సుమారు 30 శాతం వరకు పడిపోవడంతో ఎలాన్ మస్క్ ఆస్తి విలువ కూడా భారీగా తగ్గింది. ఒక దశలో సుమారు 1.4 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేసిన సంపద ప్రస్తుతం 992 నుంచి 997 బిలియన్ డాలర్ల మధ్యకు చేరినట్లు సమాచారం. ఈ పరిణామంతో ఆయన ప్రపంచ ఆర్థిక వర్గాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారారు. స్పేస్‌ఎక్స్ సంస్థ కృత్రిమ మేధస్సు రంగంలో విస్తరణ కోసం పెట్టుబడి సమీకరణ చర్యలు చేపట్టనున్నట్లు ప్రకటించడం కూడా మార్కెట్‌పై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. పెట్టుబడిదారుల్లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో షేర్ల విలువ వరుసగా తగ్గుతూ వచ్చింది. ఒకప్పుడు గరిష్ఠ స్థాయిలో ఉన్న షేరు ధర ఇప్పుడు సుమారు 150 డాలర్ల పరిధికి చేరినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో టెస్లా కంపెనీ షేర్లు కూడా ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. జూన్ 23న ఒక్కరోజే టెస్లా షేరు విలువ దాదాపు ఆరు శాతం వరకు పడిపోయింది. టెస్లాలో కూడా ఎలాన్ మస్క్‌కు భారీ వాటా ఉండటంతో ఆ ప్రభావం ఆయన వ్యక్తిగత సంపదపై నేరుగా పడినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న మార్పులు, పెట్టుబడిదారుల ధోరణి, సాంకేతిక రంగంలోని పరిణామాలు ప్రపంచ కుబేరుల సంపదపై ఎంత వేగంగా ప్రభావం చూపగలవో తాజా పరిణామాలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులు ఎలా మారుతాయనే అంశంపై ప్రపంచ ఆర్థిక వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.



# రైతుల భూములు లాక్కుంటే ఊరుకోం..

- పోడు రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధర్నా
- అటవీ అధికారుల తీరుపై ఆగ్రహం
- వర్షంలోనూ కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఎమ్మెల్యే, రైతులు
- పోలీసులతో వాగ్వాదం.. ఉద్రిక్తత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కెరమెరి మండలం సుర్దాపూర్ గ్రామ శివారులో ఎన్నో ఏళ్లుగా పోడు భూములను నమ్ముకుని జీవిస్తున్న రైతులకు అటవీ శాఖ అధికారులు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి నేతృత్వంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సుర్దాపూర్ శివారులోని సాగు భూములను అటవీ అధికారులు బలవంతంగా స్వాధీనం చేసుకుని, అక్కడ ట్రెంచ్ ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ బాధిత రైతులతో కలిసి ఆమె ఈ ఆందోళనకు దిగారు. ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములను తమకే తిరిగి అప్పగించాలని ఈ సందర్భంగా పోడు రైతులు డిమాండ్ చేశారు.

## రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం: కోవ లక్ష్మి

రైతుల భూములు లాక్కొని రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. అటవీ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభమై, రైతులు ఎంతో ఆశతో దుక్కులు దున్ని విత్తనాలు వేసుకున్న తరుణంలో.. అటవీ అధికారులు వచ్చి సాగు భూముల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకోవడం అత్యంత అన్యాయం. దాదాపు 40 నుంచి 50 ఏళ్లుగా స్థానిక రైతులు ఈ భూములను సాగు చేసుకుంటున్నారని, ఇప్పుడు హఠాత్తుగా వాటిని అటవీ భూములంటూ లాక్కోవడం సరైంది కాదని ఆమె మండిపడ్డారు. ఈ ఏడాదికి రైతులకు యథావిధిగా సాగు చేసుకునే అవకాశం కల్పించాలని, వచ్చే ఏడాది రెవెన్యూ మరియు ఫారెస్ట్ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

## పోలీసులతో వాగ్వాదం.. కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

ఆందోళన ఉధృతం కావడంతో కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించిన ఎమ్మెల్యేను, రైతులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యే కోవ లక్ష్మికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే లక్ష్మి రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట రోడ్డుపైనే బైఠాయించారు. పోడు రైతులకు తక్షణమే న్యాయం చేయాలని, సాగు భూములపై రైతులకు పూర్తి హక్కులు కల్పించాలని ఆమె పట్టుబట్టారు. ఈ ఆందోళనతో కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్ , వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్, బీఅర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు మర్సకుల సరస్వతి, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ అబ్దుల్ కలాం, బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, బిఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బీన్ అబ్దుల్లా నాయకులు పొన్నాల నారాయణ, గుండా శ్యామ్, పోడు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డీఎఫ్ఓకు వినతిలి

కెరమేరి మండలంలోని సురదాపూర్ గ్రామంలోని పోడూ రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా అనంతరం ఎమ్మెల్యే కోవలక్ష్మి ,పార్టీ నాయకులు, పోడు రైతులతో కలిసి డీఎఫ్ఓ కార్యాలయానికి వెళ్లి డిఎఫ్ఓ బాలమణికు వినతి పత్రం అందజేశారు.

# ధరలు పెంచిన ట్రయంఫ్ బైక్‌లు

**న్యూఢిల్లీ, జులై 7 :** ప్రీమియం ద్విచక్ర వాహన తయారీ సంస్థ ట్రయంఫ్ మరోసారి తన 350 సీసీ శ్రేణి బైక్‌ల ధరలను పెంచింది. ఏప్రిల్‌లో ఈ శ్రేణిని మార్కెట్‌లోకి తీసుకొచ్చిన తర్వాత జూన్‌లో ఒకసారి ధరలు సవరించిన సంస్థ, నెల రోజుల వ్యవధిలోనే మరోసారి రేట్లను పెంచింది. దీంతో కొత్త బైక్ కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులపై అదనపు భారం పడనుంది. కొత్త ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఈసారి ధరల పెంపు 1.22 శాతం నుంచి 5.03 శాతం వరకు ఉంది. ప్రారంభంలో పన్ను రాయితీ ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలనే ఉద్దేశంతో ధరలను తక్కువ స్థాయిలో ఉంచిన సంస్థ, ఇప్పుడు అన్ని మోడళ్లపై ధరలను సవరించింది. దీంతో ట్రయంఫ్ 350 సీసీ శ్రేణి బైక్‌ల కొనుగోలు ఖర్చు మరింత పెరిగింది. అన్ని మోడళ్లలో స్పీడ్ టీ4 ధరనే అత్యధికంగా పెరిగింది. ఈ మోడల్‌పై రూ.10 వేల పెంపు ప్రకటించడంతో ధర రూ.1.99 లక్షల నుంచి రూ.2.09 లక్షలకు చేరుకుంది. విడుదల సమయంలో ఉన్న ధరతో పోలిస్తే ఇప్పుడు మొత్తం రూ.14 వేల వరకు పెరిగింది. స్పీడ్ 400 ధర కూడా రూ.6 వేల పెరిగి రూ.2.34 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు చేరుకుంది. ట్రాకర్ 400పై అత్యల్పంగా రూ.3 వేల ధర పెంపు జరిగింది. దీంతో దీని ధర రూ.2.46 లక్షల నుంచి రూ.2.49 లక్షలకు చేరుకుంది. స్క్రాంబ్లర్ 400 ఎక్స్ ధర రూ.2.59 లక్షల నుంచి రూ.2.65 లక్షలకు పెరిగింది. త్రక్స్టన్ 400 ధర రూ.2.70 లక్షల నుంచి రూ.2.75 లక్షలకు చేరుకోగా, స్క్రాంబ్లర్ 400 ఎక్స్‌సీపై రూ.5 వేల పెంపుతో కొత్త ధర రూ.2.99 లక్షలుగా నిర్ణయించారు. ట్రయంఫ్ ప్రపంచవ్యాప్తంగా ప్రీమియం మోటార్‌సైకిళ్ల తయారీలో ప్రత్యేక గుర్తింపు పొందిన సంస్థ. స్పోర్ట్స్, అడ్వెంచర్, క్లాసిక్ శ్రేణి బైక్‌లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్న ఈ సంస్థ భారత్‌లో ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థతో భాగస్వామ్యం చేసి తన బైక్‌లను తయారు చేస్తోంది. స్పీడ్ 400, స్క్రాంబ్లర్ 400 ఎక్స్ వంటి మోడళ్లకు దేశీయ మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తుండగా, తాజా ధరల పెంపు కొనుగోలుదారులపై అదనపు ఆర్థిక భారం మోపనుంది.





# నథింగ్ ఫోన్ 4బి లాంచ్

## అత్యంత తక్కువ ధరకే!

**న్యూఢిల్లీ, జులై 7 :** ప్రముఖ సాంకేతిక ఉత్పత్తుల తయారీ సంస్థ నథింగ్ భారతీయ వినియోగదారుల కోసం మరో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించేందుకు సిద్ధమైంది. నేడు మధ్యాహ్నం నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ తన కొత్త 'ఫోన్ 4బి'ను అధికారికంగా విడుదల చేయనుంది. ఇదే కార్యక్రమంలో కొత్త వైర్‌లెస్ ఇయర్‌బడ్స్‌ను కూడా పరిచయం చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. తక్కువ ధరలో మెరుగైన సౌకర్యాలతో వినియోగదారులను ఆకట్టుకునే లక్ష్యంతో రూపొందించిన ఈ కొత్త ఫోన్‌పై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మోడళ్లతో పోలిస్తే మరింత సరసమైన ధరలో ఈ ఫోన్ మార్కెట్‌లోకి రానుందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా యువతను దృష్టిలో ఉంచుకుని ఆకర్షణీయమైన రూపకల్పనతో పాటు ఆధునిక సాంకేతికతను ఇందులో అందించనున్నట్లు సమాచారం. ఈ ఫోన్‌లో శక్తివంతమైన ప్రాసెసర్‌తో పాటు కృత్రిమ మేధస్సు ఆధారిత సదుపాయాలకు మద్దతు ఉండనుంది. ఆరు దశాంశ ఏడు అంగుళాల పూర్తి స్పష్టత కలిగిన అమోలెడ్ తెర, నూట ఇరవై హెర్ట్జ్ రిఫ్రెష్ రేటు, ఎనిమిది జీబీ వరకు జ్ఞాపకశక్తి, రెండు వందల యాభై ఆరు జీబీ వరకు నిల్వ సామర్థ్యంతో ఈ ఫోన్ అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. తాజా ఆండ్రాయిడ్ ఆధారిత నిర్వహణ వ్యవస్థతో ఇది పనిచేయనుంది. భారీ సామర్థ్యం కలిగిన బ్యాటరీతో పాటు వేగవంతమైన చార్జింగ్ సదుపాయాన్ని కూడా ఇందులో అందించనున్నారు. బ్యాటరీ సామర్థ్యంపై భిన్నమైన ప్రచారం జరుగుతున్నప్పటికీ, అధికారిక వివరాలు విడుదల కార్యక్రమంలోనే వెల్లడికానున్నాయి. ఒకసారి పూర్తిగా చార్జ్ చేస్తే ఎక్కువసేపు ఉపయోగించుకునేలా దీనిని రూపొందించినట్లు సమాచారం. నథింగ్ సంస్థకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన పారదర్శక వెనుక భాగం రూపకల్పనను ఈ ఫోన్‌లో కూడా కొనసాగించారు. వెనుక భాగంలో ప్రత్యేక కాంతి వ్యవస్థను అమర్చినట్లు తెలుస్తోంది. రెండు కెమెరాల అమరికతో పాటు ఆకర్షణీయమైన రూపాన్ని కలిగి ఉండనున్న ఈ ఫోన్‌కు క్రికెట్ అభిమానులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక సంచికను కూడా తీసుకురావచ్చునే ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడాల్సి ఉంది.

# ‘సర్పంచ్ సాబ్’ సత్తాకు పరీక్ష



- ఆ స్టార్స్ రాణించకుంటే అంతే సంగతులు!
- భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో టీ20
- భారత జట్టులో కీలక మార్పులు

భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఈరోజు రాత్రి మూడో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్‌కు ముందు భారత జట్టులో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో.. టీమ్ మేనేజ్‌మెంట్ కూర్పులో కొన్ని మార్పులు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఎంట్రీతో వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్‌కు మరోసారి నిరాశ తప్పదు. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ జోడీ కొనసాగనుంది. రెండో టీ20లో వైభవ్ తన అరంగేట్ర మ్యాచ్‌లో దూకుడు బ్యాటింగ్‌తో ఆకట్టుకోవడంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై విశ్వాసం ఉంచింది. దీంతో సంజు శాంసన్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు లేవు. బుడ్డోడి నుంచి మేనేజ్‌మెంట్ భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్, తిలక వర్మలు బ్యాట్ ఝుళిపించాల్సిన అవసరం ఉంది. అలానే శివమ్ దూబే కూడా కీలక పరుగులు చేయాలని ఫాన్స్ కోరుకుంటున్నారు. బౌలింగ్ విభాగంలో కూడా మార్పులు జరగనున్నాయి. స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను తప్పించి యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను తిరిగి తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. పేస్ దళంలో యాదవ్‌తో పాటు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలు కొనసాగనున్నారు. స్పిన్ విభాగంలో అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి జోడీ కొనసాగనుంది. ముఖ్యంగా వరుణ్ ఇటీవల అద్భుత ఫామ్‌లో లేకపోవడం భారత జట్టుకు మైనస్ అయింది. తన వైవిధ్యమైన స్పిన్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడితే టీమిండియాకు తిరుగుండదు. ఈ మ్యాచ్ భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు కూడా ఎంతో కీలకంగా మారింది. సిరీస్‌లో ఇంకా విజయాన్ని నమోదు చేయని భారత్‌కు మూడో టీ20 ‘డూ ఆర్ డై’ మ్యాచ్‌లా మారింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్‌లో నిలబడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ‘సర్పంచ్ సాబ్’ కెప్టెన్సీ సత్తాకు పరీక్షగా నిలవనుంది. అలానే స్టార్ రాణించకుంటే.. ఈ మ్యాచ్ ఫలితంపై ప్రభావం చూపనుంది. యువ ఆటగాళ్లతో కూడిన జట్టు ఒత్తిడిని అధిగమించి విజయాన్ని అందుకోవాలని భారత అభిమానులు ఆశిస్తున్నారు.

# వైభవ్ కాదు.. శాంసన్‌పై వేటుకు ఆ చిచ్చరపిడుగే కారణం!





స్వదేశంలో ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో భారత్‌ను గెలిపించిన సంజూ శాంసన్ అనూహ్యంగా ఇప్పుడు స్క్వాడ్‌లో లేడు. మూడు మ్యాచుల్లో విఫలమయ్యాడని అతడిని జింబాబ్వే పర్యటనకు తప్పించారు. అయితే.. యువసంచలనం వైభవ్ సూర్యవంశీ కోసమే శాంసన్‌ను పక్కనపెట్టేశారనే ప్రచారం జరుగుతోంది. కానీ, ఆసియా క్రీడల స్క్వాడ్‌లో భాగమైన సంజూను జింబాబ్వే సిరీస్‌కు తీసుకోకపోవడానికి కారణం వైభవ్ కాదని, ఐపీఎల్‌లో దంచేస్తున్నచిచ్చరపిడుగు అని సెలెక్టర్లు చెప్పినట్టు క్రిక్‌ఇన్ఫో కథనం పేర్కొంది. ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్, ఇంగ్లండ్ చేతిలో పరాజయంతో భారత సెలెక్టర్లు టీ20 స్క్వాడ్‌లో భారీ మార్పులు చేశారు. జింబాబ్వే పర్యటనకు పలువురిని పక్కనపెట్టి.. ఐపీఎల్‌లో, దేశవాళీ క్రికెట్‌లో రాణించిన వాళ్లను ఎంపిక చేశారు. ఓపెనర్‌గా విఫలమవుతున్న సంజూ శాంసన్‌పై వేటు వేశారు. దాంతో, వైభవ్ సూర్యవంశీ కోసమే సంజూను తప్పించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అయితే.. అందరూ అనుకుంటున్నట్టు వైభవ్ కోసం సంజూను పక్కనపెట్టలేదని.. టీ20ల్లో చితక్కొడుతున్న ప్రభ్‌సిమ్రన్ సింగ్‌కు అవకాశం ఇవ్వాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సెలెక్టర్లు చెప్పారని క్రిక్‌ఇన్ఫో కథనం వెల్లడించింది. ‘సొంతగడ్డపై జరిగిన పొట్టి వరల్డ్‌కప్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడిన సంజూ శాంసన్ టీ20 స్క్వాడ్‌లో భాగమే. సెప్టెంబర్‌లో జపాన్ వేదికగా మొదలయ్యే ఆసియా క్రీడల స్క్వాడ్‌లోనూ శాంసన్ ఉన్నాడు. అయితే.. జింబాబ్వే పర్యటనకు పెద్దగా ప్రాధాన్యం లేనందునే అతడిని ఎంపిక చేయలేదు. చిన్న సిరీస్‌కు ఇద్దరు సీనియర్ వికెట్ల కీపర్లు ఇషాన్ కిషన్, సంజూలను ఎంపిక చేయడం సరైంది కాదనిపించింది. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున గత రెండు సీజన్లలో ప్రభ్‌సిమ్రన్ సింగ్ మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. అందుకని వికెట్ కీపర్, బ్యాటరైన అతడికి అవకాశం ఇవ్వాలనుకున్నాం’ అని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్ల బృందం పేర్కొన్నట్టు క్రిక్‌ఇన్ఫో తెలిపింది. జింబాబ్వే సిరీస్ కోసం సోమవారం శ్రేయాస్ అయ్యర్ సారథిగా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. జింబాబ్వేతో టీ20 సిరీస్ కోసం భారత సెలెక్టర్లు స్క్వాడ్‌లో కీలక మార్పులు చేశారు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన వారిలో సగం మందిని తప్పించి కొత్త వాళ్లకు ప్రాధాన్యమిచ్చారు. ఐర్లాండ్‌పై తేలిపోయిన ఓపెనర్ సంజూ శాంసన్‌పై వేటు పడగా.. ఓపెనర్‌గా వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం దక్కింది. అలానే వికెట్ కీపర్‌గా ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఎంపికవ్వగా.. మిడిలార్డర్ బ్యాటర్‌గా సూర్యాన్ష్ షెడ్గే, ఫినిషర్‌గా రింకూ సింగ్‌ను తీసుకున్నారు. ఐపీఎల్ 19వ సీజన్‌లో మెరిసిన ప్రిన్స్ యాదవ్, అశోక్ శర్మ, హర్ష్ దూబే, మయాంక్ యాదవ్‌లో బౌలింగ్ దళంలో చోటు దక్కించుకున్నారు. భారత్, జింబాబ్వే మధ్య జూలై 23 నుంచి హరారేలో టీ20 సిరీస్ మొదలవ్వనుంది. ఈ సిరీస్‌తో ప్రభ్‌సిమ్రన్ అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేయనున్నాడు.

# ఎల్లీస్ పెర్రీ..

- మరోసారి అద్భుత ప్రదర్శన చేసిన ఎల్లీస్ పెర్రీ
- 7 మ్యాచ్‌లలో 198 పరుగులు, 4 వికెట్స్
- క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్

■ మహిళల క్రికెట్‌కు చిరునామా.. ■ చరిత్రలోనే గొప్ప ఆల్‌రౌండర్!







ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ స్టార్ ఎల్లీస్ పెర్రీ మరోసారి తన అద్భుత ఆటతో ప్రపంచ క్రికెట్ అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. మహిళల టీ20 ప్రపంచ కప్‌లో ఈ ఆసీస్ అందం 7 మ్యాచ్‌లలో 198 పరుగులు చేయడమే కాకుండా 4 వికెట్లు పడగొట్టింది. మెగా టోర్నమెంట్‌లో బ్యాట్, బాల్ రెండింటితోనూ అద్భుతంగా రాణించింది. బ్యాటింగ్‌లో49.50 సగటు, 132.88 స్ట్రైక్ రేట్‌ను నమోదు చేసింది. బౌలింగ్‌లో 7.50 సగటును కొనసాగించింది. ఆసీస్ పొట్టి కప్ గెలవడంలో పెర్రీ తన వంతు పాత్ర పోషించింది. బ్యాట్‌తో పరుగులు, బంతితో వికెట్లు, కీలక మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శనలతో ఎల్లీస్ పెర్రీ మహిళల క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరిగా గుర్తింపు పొందింది. ఇప్పటికే తొమ్మిది ఐసీసీ ట్రోఫీలు గెలుచుకున్న ఆమె.. ఆస్ట్రేలియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ సరికొత్త చరిత్రలు సృష్టిస్తోంది. పెర్రీ కెరీర్‌లో మరో విశేషం ఏమిటంటే.. ఆమె కేవలం క్రికెటర్ మాత్రమే కాదు, ఫుట్‌బాలర్ కూడా. ఆస్ట్రేలియా తరఫున అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ కూడా ఆడిన అరుదైన క్రీడాకారిణి. రెండు క్రీడల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె బహుముఖ ప్రజ్ఞకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 1,000కిపైగా పరుగులు చేయడంతో పాటు 100కిపైగా వికెట్లు తీసిన తొలి మహిళా క్రికెటర్ కూడా ఎల్లీస్ పెర్రీనే. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ రాణిస్తూ మహిళల క్రికెట్‌లో కొత్త ప్రమాణాలు నెలకొల్పింది. అందుకే ఆమె ప్రపంచ క్రికెట్‌లో గొప్ప ఆల్‌రౌండర్ అయింది. టెస్టు క్రికెట్‌లోనూ పెర్రీ రికార్డులు సృష్టించింది. ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్‌గా అజేయంగా 213 పరుగులు చేసి అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన ఆటగాడిగా నిలిచింది. వ్యక్తిగత విజయాలతో పాటు జట్టు విజయాల్లోనూ ఎల్లీస్ పెర్రీ కీలక పాత్ర పోషించింది. ఆమె ఖాతాలో ఇప్పటికే 9 ఐసీసీ ట్రోఫీలు ఉన్నాయి. అలాగే రెండుసార్లు ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ టైటిల్, ఒకసారి ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను కూడా గెలుచుకుంది. అంతేకాదు ఐసీసీ మహిళా క్రికెటర్ ఆఫ్ ది డికేడ్ అవార్డును సొంతం చేసుకుని తన గొప్పతనాన్ని మరోసారి నిరూపించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా నిలకడగా ఆడుతున్న పెర్రీ.. ప్రపంచవ్యాప్తంగా యువ క్రికెటర్లకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆమె సాధించిన విజయాలు, నెలకొల్పిన రికార్డులు మహిళల క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.



# ర్యాంకింగ్స్ టాప్‌లో ఇండియన్ ప్లేయర్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన మహిళా టీ20 ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఇటీవల ముగిసిన మహిళా టీ20 వరల్డ్ కప్ 2026లో అద్భుత ప్రదర్శన చేసిన ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ మళ్లీ నంబర్–1 బ్యాటర్‌గా అవతరించింది. ఆమె తన కెరీర్‌లో ఈ ఘనత సాధించడం ఇది ఐదోసారి. వరల్డ్ కప్‌లో ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’ అవార్డును గెలుచుకున్న మూనీ, ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై 64 పరుగుల మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడి అగ్రస్థానానికి చేరుకుంది. ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించి ఆస్ట్రేలియా ఏడోసారి ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. బ్యాటింగ్ ర్యాంకింగ్స్ టాప్–10 జాబితాలో ముగ్గురు భారతీయ ఆటగాళ్లకు చోటు దక్కింది. భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఐదో స్థానంలో కొనసాగుతుండగా, షెఫాలీ వర్మ ఆరో స్థానంలో, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పదో స్థానంలో నిలిచారు. సౌతాఫ్రికాకు చెందిన లారా వోల్వార్డ్ మూడో స్థానంలో, వెస్టిండీస్ ఆల్ రౌండర్ హేలీ మాథ్యూస్ నాలుగో స్థానంలో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో భారత్‌కు చెందిన యువ స్పిన్నర్ శ్రీ చరణి సరికొత్త రికార్డు సృష్టించి T20I బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్–1 స్థానాన్ని కైవసం చేసుకుంది. వరల్డ్ కప్‌లో కేవలం ఐదు మ్యాచ్‌ల్లోనే 14 వికెట్లు పడగొట్టి టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచింది. ఐసీసీ ప్రకటించిన ‘టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్’ లో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ ఆటగాడిగా ఆమె నిలిచింది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ రెండో స్థానంలో, చార్లీ డీన్ మూడో స్థానంలో నిలిచారు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో వెస్టిండీస్ ఆటగాడు హేలీ మాథ్యూస్ తన నంబర్–1 స్థానాన్ని నిలబెట్టుకుంది.

# గౌతమ్ గంభీర్‌కు బిగ్ షాక్..

## టీమిండియాకు కొత్త హెడ్ కోచ్ వచ్చేశారు.

భారత క్రికెట్ నియంత్రణ మండలి జింబాబ్వే పర్యటనకు వెళ్లే 15 మంది సభ్యుల భారత జట్టును ప్రకటించిన తర్వాత.. తాజాగా టీమ్ కోచింగ్ స్టాఫ్‌కు సంబంధించిన ఒక కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. జింబాబ్వే పర్యటనకు ప్రస్తుత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వెళ్లడం లేదు. ఆయన స్థానంలో టీమిండియా మాజీ క్రికెటర్, ప్రస్తుతం ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’ అధిపతిగా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్ తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు వహించనున్నారు.

### బిజీ షెడ్యూల్ వల్లే ఈ నిర్ణయం..

భారత జట్టు రాబోయే రోజుల్లో వరుస అంతర్జాతీయ సిరీస్‌లతో బిజీగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతం గౌతమ్ గంభీర్ భారత జట్టుతో కలిసి ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్నారు. ఈ సిరీస్ ముగిసిన కొద్ది రోజులకే జూలై 23 నుంచి జింబాబ్వే పర్యటన ప్రారంభం కానుంది. గంభీర్‌కు విశ్రాంతినిస్తూ, పనిభారాన్ని తగ్గించేందుకు గానూ ఈ పర్యటన బాధ్యతలను లక్ష్మణ్‌కు అప్పగించారు.

జింబాబ్వే పర్యటనతో పాటు ఈ ఏడాది సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లో జరిగే ఏషియన్ గేమ్స్ 2026 లో కూడా భారత జట్టుకు లక్ష్మణ్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తారు. అదే సమయంలో వెస్టిండీస్ జట్టు భారత్‌లో పర్యటించనుంది. రెండు సిరీస్‌లు ఒకేసారి జరగడం వల్ల గంభీర్ సీనియర్ జట్టుతో కలిసి వెస్టిండీస్ సిరీస్‌లో ఉంటారు, లక్ష్మణ్ ఏషియన్ గేమ్స్ జట్టును నడిపిస్తారు.

### సపోర్ట్ స్టాఫ్‌లో మరికొంతమంది..

వీవీఎస్ లక్ష్మణ్‌తో పాటు సపోర్ట్ స్టాఫ్‌లో మరో ఇద్దరు మాజీ భారత ఆటగాళ్లకు చోటు లభించింది. మాజీ క్రికెటర్ కనిత్కర్ బ్యాటింగ్ కోచ్‌గా, మాజీ స్పిన్నర్ సునీల్ జోషి బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ కోచింగ్ త్రయం జింబాబ్వే సిరీస్, ఏషియన్ గేమ్స్ తర్వాత బంగ్లాదేశ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లోనూ కొనసాగే అవకాశం ఉంది. గౌతమ్ గంభీర్ కోచింగ్ లో టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ 2025, టీ20 వరల్డ్ కప్ 2026 వంటి పెద్ద టోర్నీలను గెలిచినప్పటికీ, ఇటీవల ఐర్లాండ్ మరియు ఇంగ్లాండ్ చేతుల్లో ఎదురైన పరాజయాల నేపథ్యంలో రాబోయే సిరీస్‌లు భారత జట్టుకు ఎంతో కీలకంగా మారాయి.



# డిఫరెంట్ లుక్‌లో డ్రాగన్.. ఎన్టీఆర్




ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ డ్రాగన్ . ఈ సినిమాలోని తన పాత్ర కోసం తారక్ ఎన్నడూ లేని విధంగా భారీగా బరువు తగ్గారు. ఆ మధ్య బయటకు వచ్చిన తారక్ అల్ట్రా స్లిమ్ మేకోవర్ చూసి అభిమానులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఒక సినిమా కోసం ఇంతలా బరువు తగ్గాలా అని కంగారు పడుతూ, తమ హీరో లుక్ చూసి అభిమానులతో పాటు సగటు సినీ ప్రేక్షకులు కూడా తీవ్ర ఆందోళన చెందారు. అయితే, ఎన్టీఆర్ బర్త్‌డే కానుకగా విడుదలైన 'డ్రాగన్' గ్లింప్స్ చూసి ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయినప్పటికీ, ఆ లుక్ వెనుక ఉన్న తారక్ కష్టం వారిని ఇబ్బంది పెడుతూనే వచ్చింది. ఇందులో 'లూగర్' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్ లుక్ కోసం ఎన్టీఆర్ తన ప్రాణం పెట్టి పనిచేశారు. సినిమా కోసం, తను నమ్మిన పాత్ర కోసం తారక్ ఎంతటి రిస్క్ అయినా తీసుకోగలడు, ఏ స్థాయికైనా వెళ్లగలడు అని తన అంకితభావంతో మరోసారి నిరూపించారు. క్యారెక్టర్‌లోని ఇంటెన్సిటీ చూశాక ప్రశాంత్ నీల్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విధ్వంసం సృష్టించబోతున్నాడో అని అందరిలో ఆసక్తి రెట్టింపయింది. అభిమానుల్లో ఉన్న ఆ టెన్షన్‌ను పటాపంచలు చేస్తూ జూలై 6న సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. అక్కినేని అఖిల్ నటిస్తున్న 'లెనిన్' మూవీ కోసం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ విషయాన్ని పంచుకుంటూ అఖిల్ తన సోషల్ మీడియాలో తారక్‌తో దిగిన లేటెస్ట్ ఫొటోలను షేర్ చేశారు. ఆ ఫొటోలు చూసిన అభిమానులు ఒక్కసారిగా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ ఇప్పటికీ స్లిమ్‌గానే ఉన్నప్పటికీ, మునపటి కంటే ఎంతో ఫ్రెష్‌గా, గ్లోయింగ్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తుండడంతో నెట్టింట కామెంట్ల వర్షం కురుస్తోంది. ఈ సరికొత్త లుక్ చూసి కుదుటపడిన ఫ్యాన్స్, ఇక 'డ్రాగన్' సినిమాలో తారక్ విశ్వరూపం ఎలా ఉండబోతుందో అని ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాలో ఊరమాస్, హై-వోల్టేజ్ యాక్షన్ రోల్ తర్వాత.. త్రివిక్రమ్ మైథాలజికల్ సినిమాలో ఎన్టీఆర్ ఎలా కనిపిస్తారు? అక్కడ తన మేకోవర్ ఎలా ఉండబోతోంది? అనే ఆసక్తి అప్పుడే టాలీవుడ్ వర్గాల్లో మొదలైంది.

# ఇక నుంచి అలాంటి సినిమాలే చేస్తా

## కాజల్ అగర్వాల్

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మాతృత్వం తర్వాత తనలో వచ్చిన మార్పులను ఆసక్తికరంగా పంచుకున్నారు. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ', 'రామాయణ' చిత్రాల విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. ఇకపై కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తానని తెలిపారు. కొడుకు నీల్ పుట్టిన తర్వాత ప్రతి కథను అతడి కోణంలోనే ఆలోచిస్తున్నానని కాజల్ చెప్పారు. భవిష్యత్తులో తన తల్లి మంచి సినిమాలు చేసిందని కొడుకు గర్వంగా చెప్పుకునేలా ఉండే కథలనే ఎంపిక చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అందుకే నటనకు ప్రాధాన్యం ఉన్న, మంచి సందేశం ఇచ్చే సినిమాలకే ప్రాధాన్యం ఇస్తున్నానన్నారు. 'రామాయణ'లో మండోదరి పాత్ర పోషిస్తున్నానని చెప్పగానే నీల్ ఎంతో ఆనందపడ్డాడని కాజల్ తెలిపారు. అతడికి రామాయణ కథలు, ముఖ్యంగా రావణుడి పాత్ర అంటే చాలా ఇష్టమని చెప్పారు. ఈ సినిమా రెండో భాగం విడుదలయ్యే సమయానికి నీల్ థియేటర్‌లో చూసే తొలి చిత్రం ఇదేనని పేర్కొన్నారు. 'ది ఇండియా స్టోరీ' గురించి మాట్లాడుతూ.. కల్తీ ఆహారం, పురుగుల మందుల వల్ల కలిగే ప్రమాదాలను ఈ చిత్రం చూపిస్తుందని చెప్పారు. ఈ సినిమా కోసం చేసిన అధ్యయనం తన వ్యక్తిగత జీవితంపైనా ప్రభావం చూపిందని, కుటుంబ సభ్యుల ఆహారపు అలవాట్ల విషయంలో ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నానని కాజల్ వెల్లడించారు.



# నా అందాలు దాచేసుకున్నా

## నటి కృతి సనన్ సంచలన విషయం వెల్లడి

గ్లామర్ ఇండస్ట్రీలో సక్సెస్ వేవ్‌ను రైడ్ చేయడం ఒక ఎత్తయితే, పర్సనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం మరో ఎత్తు. ముఖ్యంగా ముప్పై ఏళ్లు దాటుతున్నాయంటే చాలు.. సొసైటీ నుంచి వచ్చే ప్రెజర్, పెళ్లి – పిల్లల డెడ్‌లైన్స్ హీరోయిన్లను కాస్త టెన్షన్ పెడుతుంటాయి. కానీ ఆ రూల్స్ అన్నిటికీ చెక్ పెడుతూ బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ కృతి సనన్ ఒక సంచలన విషయాన్ని తీసుకుంది. తాను కెరీర్ ఫుల్ పీక్స్‌లో ఉన్నప్పుడే 'ఎగ్ ఫ్రీజింగ్' చేయించుకున్నానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో హోస్ట్ కరిష్మాతో మాట్లాడిన కృతి ఈ విషయాన్ని బయటపెట్టింది. కృతిసనన్ తనకు నేషనల్ అవార్డు తెచ్చిపెట్టిన 'మిమి' సినిమా షూటింగ్ టైమ్‌లోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు చెప్పింది. ఈ సినిమాలోని క్యారెక్టర్ కోసం చాలా బరువు పెరగాల్సి వచ్చిందట. దాంతో ఆ టైమ్‌లోనే ఎగ్ ఫ్రీజింగ్ ప్రాసెస్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిపింది. ఈ ప్రక్రియ వల్ల బాడీలో హార్మోనల్ చేంజెస్ వచ్చి శరీరం కాస్త ఉబ్బడం కామన్. ఎలాగూ సినిమా కోసం వెయిట్ గేన్ అవ్వాలి కాబట్టి ఆ రెండు నెలల బ్రేక్‌ను పర్ఫెక్ట్‌గా వాడుకుంటూ సైలెంట్‌గా ఈ మెడికల్ ప్రొసీజర్‌ను ఫినిష్ చేసినట్లు కృతిసనన్ తెలిపింది.ఆ సమయంలో మూడ్ స్వింగ్స్, ఫిజికల్ అండ్ ఎమోషనల్ చేంజెస్ ఫేస్ చేశానని కృతి చాలా ఓపెన్‌గా ఒప్పుకుంది. ఒక ప్రెగ్నెంట్ ఉమెన్ ఎలాంటి రోలర్ కోస్టర్ రైడ్‌ను ఎక్స్ పీరియన్స్ చేస్తుందో, తాను కూడా దాదాపు అలాంటి ఒడిదుడుకులే చూశానని.. కానీ ఇప్పుడు మాత్రం మైండ్ చాలా పీస్‌ఫుల్‌గా ఉందంటూ హ్యాపీగా చెప్పుకొచ్చింది. నిజానికి ఇండియన్ స్క్రీన్ పై ఈ మోడ్రన్ బాట పట్టిన ఫస్ట్ సెలబ్రిటీ కృతి కాదు. గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా తన థర్టీస్ స్టార్టింగ్‌లోనే ఎగ్స్ ఫ్రీజ్ చేసుకోగా.. ప్రొడ్యూసర్ ఏక్తా కపూర్, మోనా సింగ్, రిచా చద్దా వంటి వారు కూడా ఇదే రూట్ ఎంచుకున్నారు. మరి కృతి సనన్ ఈ విషయాన్ని బయట పెట్టిన తర్వాత ఇంకెంతమంది ఈ బాట పడతారో చూడాలి.



# సత్లుజ్ మూవీని చూడాలి..చూపించాలి

## ఎక్స్ వేదికగా దర్శకుడు రమ్‌గోపాల్ వర్మ



ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన చిత్రం 'సత్లుజ్'. సెన్సార్ సమస్యల కారణంగా నేరుగా ఓటీటీలో విడుదల చేయగా.. ఆ తర్వాత దాన్ని తొలగించారు. ఈ మూవీని చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'సత్లుజ్' మూవీ చూశా. ఇది సినిమా కాదు. ఎప్పటికీ నయం కానీ బలమైన గాయం. మన చరిత్రలోని చీకటి అధ్యాయాన్ని గుర్తు చేస్తుంది. దిల్జిత్ దొసాంజే గుండెలు బాదుకునేలా నటించలేదు. మనఃసాక్షికి అనుగుణంగా ఎంతో నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్లాడు. అర్జున్ రామ్‌పాల్ నటన అదనపు బలాన్ని ఇచ్చింది. నేరాల్లో వ్యవస్థలు భాగమైన తీరును వాస్తవికతతో చూపించారు. ఈ సినిమాను సంచలనం చేయడం కన్నా.. ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దారు. తెరపై అధికారిక ఫైళ్లు, దహన సంస్కారాల వివరాలు, గుసగుస సంభాషణలు వంటివి ఈ కథలోని తీవ్రతను తెలియజేశాయి. స్వలాభం కన్నా.. సత్యాన్ని వెల్లడించేలా తీర్చిదిద్దడంతో ఇది మరింత బలంగా తెరపై ఆవిష్కృతమైందని రామ్ అన్నారు. ప్రజాస్వామ్యం తన పౌరులనే కబళించి, అందుకు సాక్ష్యాలు లేకుండా ఎలా తుడిచేస్తుందో సినిమాలో తెలియజేయడం సాధారణ విషయం కాదు. ఈ విషయంలో చిత్ర బృందం తనవంతు బాధ్యతను చక్కగా పూర్తి చేసింది. ఇదే నిజమైన కళ. ఇది నిజంగా అత్యంత ధైర్యవంతమైన ఫిల్మ్ మేకింగ్. ఈ సినిమా చాలా మందిని కలవరపెడుతుంది.. అవగాహన కల్పిస్తుంది.. ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. సత్యం, నిజాయతీని సినిమా మాధ్యమం ద్వారా చెప్పినప్పుడు అది 'సత్లుజ్' అవుతుంది. ఇలాంటి సినిమాను చూడాలి. చూపించాలి. చర్చించాలి. కానీ, సినిమాలో బాధితులను చేసినట్లు ఎన్‌కౌంటర్ చేయకూడదు. అధికారంలో ఉన్న వారందరికీ నా విన్నపం ఏంటంటే.. 'సత్లుజ్'లో జస్వంత్ సింగ్ ఖల్రా'ను చేసినట్లు ఈ సినిమాను చేయకండి. నిజాన్ని దాచాలనుకుంటే అది మరింత దృఢంగా మారుతుందని వర్మ అన్నారు.

# హైదరాబాద్‌లో శరవేగంగా చిరు మూవీ షూట్

చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. మెగా158 వర్కింగ్ టైటిల్ గా ప్రచారంలో ఉన్న దీనిపై టీమ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోందని తెలిపింది. మునుపెన్నడూ చూడని భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని.. చిరును కొత్త కోణంలో చూస్తారని వెల్లడించింది. రామ్–లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. సినిమాకు ఈ సీన్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. చిరు ఇందులో రిస్క్‌తో కూడిన స్టంట్స్ చేస్తున్నారని.. త్వరలో దీని టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. 'వాల్తేర్ వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి – బాబీ కాంబోలో ఈ చిత్రం రానుండడంతో అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే పొల్లాచ్చిలో ఓ కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు కొన్ని యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేశారు.




Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717